

ఉమ్మడి జిల్లాలో 329 ఉపాధ్యాయ పోస్టులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో 329 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్టు ప్రభుత్వం తేల్చింది. ఇందులో సెకండరీగ్రేడ్ 101, స్కూలు అసిస్టెంట్ 133, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు 95 ఉన్నాయి. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాల వారీగా ఖాళీల వివరాలు వెల్లడించారు. అయితే మేనేజ్‌మెంట్‌ల వారీగా ఖాళీలు, స్కూలు అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా వివరాలు ఇంకా ప్రకటించలేదు. ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలుకానున్నందున ఆ రోజు సబ్జెక్టు వారీగా ఖాళీలు వెల్లడిస్తారని విద్యా శాఖ వర్గాలు తెలిపాయి.

నగరంలో నాకాబందీ

ఆకస్మికంగా వాహనాల తనిఖీ

- 1200 మంది పోలీసులతో ఎక్కడికక్కడ సోదాలు
- సరైన పత్రాలు లేని 663 వాహనాలను సీజ్
- 14.47 కిలోల బంగారం, 31.314 కిలోల వెండి, రూ.14.76 లక్షల నగదు, గంజాయి, 800 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం
- ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసులు ఆకస్మికంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ వాహనాల తనిఖీ (నాకాబందీ) చేపట్టారు. పోలీస్ కమిషనర్ రవిశంకర్‌అయ్యన్నార్ ఆదేశాల మేరకు 1200 మంది 110 బృందాలుగా విడిపోయి ఎక్కడికక్కడ వాహనాల సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 663 వాహనాలను సీజ్ చేశారు. పినగాడి జంక్షన్‌లో ద్విచక్ర వాహనదారుడి వద్ద పది కిలోల గంజాయి లభ్యమవ్వడంతో అరెస్టు చేశారు. బైక్‌ను సీజ్ చేశారు. అలాగే అగనంపూడి సమీపంలోని శనివాడ జంక్షన్ వద్ద ఒక కారులో 14.47 కిలోల బంగారం, 31.314 కిలోల వెండి లభ్యమవ్వడంతో స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. వాటికి సంబంధించి వారి వద్ద పత్రాలు ... మిగతా 6వ పేజీలో

బుగ్గన వారి బొంకులు



- నగరానికి ఐటీ కంపెనీలు తరలి వచ్చాయట
- వేలాది మంది ఉద్యోగ అవకాశాలు కల్పించారట
- అదానీ డేటా సెంటర్ పనులు అవుతున్నాయట
- విశాఖ విమానాశ్రయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే అభివృద్ధి చేసిందట...

- భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారట
- భోగాపురం విమానాశ్రయం, అదానీ డేటా సెంటర్‌కు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన
- మరోసారి వైసీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అలవోకగా అబద్ధాలు ఆడేశారు. బుధవారం సమర్పించిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో 'అభివృద్ధి' అంటూ చేయనవన్నీ చేసినట్టు బొంకేశారు. కొన్ని అంశాలపై కనీస అవగాహన లేకుండా, రాష్ట్ర ప్రభుత్వం పాత్ర లేకున్నా...జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అన్నీ చేసినట్టు చెప్పుకొచ్చారు. వాటిలో విశాఖపట్నం జిల్లాకు సంబంధించినవి అనేకం ఉన్నాయి.

భీమిలిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పెట్టారట

రాష్ట్రంలో భీమిలి సహా ఆరు ప్రాంతాల్లో రూ.127 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటుచేశామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. వాస్తవానికి భీమిలిలో అటువంటి సెంటర్ ఏమీ లేనే లేదు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ... మిగతా 6వ పేజీలో

బడ్జెట్‌లో వాస్తవాలు చెప్పలేదు



రాష్ట్ర ఆర్థిక మంత్రి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వాస్తవాలు చెప్పలేదు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయలేదు. అప్పులపై అబద్ధాలు చెప్పారు. ఉత్తరాంధ్రలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు తాగునీరు అందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయని అడ్డగోలుగా అబద్ధం చెబుతూ ప్రజలను మోసంచేశారు. ఐదేళ్లగా ప్రాజెక్టుకు పైసా ఇవ్వని జగన్మోహనరెడ్డి ప్రభుత్వం, పనులు పురోగతిలో ఉన్నాయని ఎలా చెబుతుంది. **పల్లా శ్రీనివాసరావు**, అధ్యక్షుడు, విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు

అన్నీ అబద్ధాలే...



2019 ఎన్నికల్లో అబద్ధాలు చెప్పినట్టే ఇప్పుడు చెబుతున్నారు. అదానీ డేటా సెంటర్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేసినప్పుడు నేనూ ఎమ్మెల్యేగా అక్కడ ఉన్నా. చంద్రబాబు ఆ భూములు లీజుకు ఇస్తే జగన్ వాటిని ఏకంగా సేల్ డీడ్‌తో అదానీకి ఇచ్చేశాడు. విశాఖపట్నం విమానాశ్రయాన్ని కేంద్రం నిధులతో నిర్మించారు. దానికి జగన్‌కి సంబంధం లేదు. డబ్ల్యుఎన్‌ఎస్ కంపెనీ రెడ్నం గార్డెన్స్‌లో ఉండేది. జగన్ దెబ్బ తట్టుకోలేక హెచ్‌ఎస్‌బీసీ పారిపోతే...ఆ భవనంలోకి డబ్ల్యుఎన్‌ఎస్ వచ్చింది. అంతే తప్ప అదేమీ కొత్త కంపెనీ కాదు. బడ్జెట్‌లో అన్నీ అబద్ధాలే. **పి.విష్ణుకుమార్‌రాజు**, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ

సుజల స్రవంతిపైనా అబద్ధాలు

పనులు పురోగతిలో ఉన్నాయంటూ మంత్రి ప్రకటన

- ప్రాజెక్టుకు ఐదేళ్లలో పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం
- కనీసం భూ సేకరణకు కూడా నిధులు విడుదల చేయని వైనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):



దేవరాపల్లి మండలంలో ఆధునికీకరణకు నోచుకోని రైవాడ ఎడమ కాలువ

'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి' ప్రాజెక్టుపై అసెంబ్లీ సాక్షిగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అబద్ధం ఆడేశారు. ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి ప్రకటించడం ప్రజలను మోసపుచ్చడమేననే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఐదేళ్లలో సుజల స్రవంతి ప్రాజెక్టుకు పైసా విదల్చలేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.6.5 కోట్లు కూడా ఇంతవరకూ చెల్లించలేదు. కనీసం ప్రధాన కాలువ నిర్మాణానికి అవసరమైన భూమిని అప్పగించాలని కాంట్రాక్టర్ కోరినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. భూసేకరణకు అనకాపల్లిలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుచేశారు. కాలువల నిర్మాణం నిమిత్తం అనకాపల్లి జిల్లాలో 6,435 ఎకరాల సేకరించాల్సి ఉండగా... 1,157 ఎకరాలకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీచేశారు. అయితే ఆ భూమికి సంబంధించి అవార్డు ప్రకటించి, తరువాత రైతులకు పరిహారం ఇవ్వాలి. ఇందుకు తొలివిడతగా రూ.900 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకూ రూపాయి విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో భూసేకరణకు సర్వే పనులు సాగుతున్నా నిధులు మాత్రం కేటాయించలేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉండగా...ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పడంపై రైతులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. కాగా రూ.7,500 కోట్లతో ప్రాజెక్టు నిర్మించాలని సుమారు 14 ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. ప్రస్తుతం వ్యయం రూ.17,050 కోట్లకు చేరింది.

నిద్దరోతున్న నిఘా వ్యవస్థ

ఉనికి కోల్పోయిన స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాలు



- సమాచార సేకరణలో విఫలం
- భూకబ్జాలు, వివాదాలను పట్టించుకోని సిబ్బంది
- తూతూమంత్రంగా నివేదికలు
- ప్రభుత్వ కార్యాలయాల్లో సాగుతున్న వ్యవహారాలపై కానరాని నిఘా
- పట్టించుకోని ఉన్నతాధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఇటీవల తహసీల్దార్ సనపల రమణయ్య హత్య, అంతకుముందు ఎంపీ కుటుంబ సభ్యుల నిర్బంధం, ఇంకా నగరంలో తరచూ జరుగుతున్న హత్యలు...పోలీసుల నిఘా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. తహసీల్దార్ హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించేందుకు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ మాట్లాడుతూ నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని అంగీకరించారు.

నగరంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తుండాలి. అందుకోసం అంతర్గతంగా ప్రత్యేకంగా స్పెషల్‌బ్రాంచిని ఏర్పాటుచేయడంతోపాటు అదనంగా ఇంటెలిజెన్స్ విభాగం సేవలను వాడుకుంటుంది. స్పెషల్‌బ్రాంచి విభాగం నుంచి ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక కానిస్టేబుల్/హెడ్ కానిస్టేబుల్ ఉంటే, ఇంటెలిజెన్స్ విభాగం నుంచి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక కానిస్టేబుల్/హెడ్‌కానిస్టేబుల్ ఉంటారు. వీరంతా తమకు కేటాయించిన పరిధిలో జరిగే భూవివాదాలు, క్రయ,విక్రయాలు, సెటిల్‌మెంట్లు, రౌడీషీటర్ల ఆగడాలు, అక్రమ వ్యాపారాలు, అవినీతి కార్యక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే వ్యవహారాలు, అధికారులు, సిబ్బంది పనితీరు, రాజకీయ నేతల కదలికలతోపాటు రాజకీయంగా జరిగే మార్పులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు తమ పైఅధికారులకు నివేదిక రూపంలో ... మిగతా 6వ పేజీలో

తహసీల్దార్ హత్య కేసు దర్యాప్తు ముగిసినట్టేనా!?

- వివరాలు వెల్లడించేందుకు ఆసక్తిచూపని పోలీసులు
- కస్టడీకి తీసుకోవడంపై గట్టిగా దృష్టిపెట్టని అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ రమణయ్య హత్య కేసు దర్యాప్తు... నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారావు అరెస్టుతో ముగిసిపోయిందన్నట్టుగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. రుషికొండలో అపార్టుమెంట్ నిర్మించిన భూమికి కన్వేయెన్స్ డీడ్ కోసం గంగారావు రూరల్ తహసీల్దార్‌గా ఉన్న రమణయ్యను సంప్రతించాడు. అయితే డీడ్ జారీ కాకుండానే రమణయ్యకు విజయనగరం జిల్లాకు బదిలీ అయిపోయింది. ఈ క్రమంలోనే రమణయ్యను గంగారావు హత్య చేశాడని పోలీసులు చెబుతున్నారు. హత్యకు పాల్పడిన గంగారావును అదుపులోకి తీసుకుని విచారిస్తే హత్యకు గల కారణాలు, వెనుక ఎవరెవరు ఉన్నారు?, గంగారావు పరారైపోవడానికి ఎవరు సహకరించారు?...వంటి విషయాలు బయటపడతాయని సీపీ రవిశంకర్ అయ్యన్నార్ చెప్పారు. గంగారావును చెన్నైలో పట్టుకున్న పోలీసులు సుమారు 24 గంటలపాటు విచారించారు. ఆ సమయంలో గంగారావు ఏ విషయాలు వెల్లడించాడనేది పోలీసులు ఇంతవరకూ బహిర్గతం చేయకపోవడం, గుట్టుచప్పుడు కాకుండా రిమాండ్‌కు పంపించేయడంతో కేసు దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాను ... మిగతా 6వ పేజీలో

మహా మాయ

17 రోజుల పాటు కార్మికులు సమ్మెల్లో ఉన్నప్పుడు పారిశుధ్య నిర్వహణకు రూ.3.2 కోట్లు ఖర్చయిందట



స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

- జీవీఎంసీ పాలకుల లెక్కలు...స్టాండింగ్ కమిటీ ఆమోదం
- ఎన్నికల కోడ్ వస్తుందని ఏకబిగిన 141 అంశాలకు క్లియరెన్స్
- మద్దిలపాలెం నుంచి ఆశీల్‌మెట్ట వరకూ రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణం

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు (అవుట్‌సోర్సింగ్) సమ్మెలో ఉన్నప్పుడు (17 రోజులు) ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం రూ.3.2 కోట్లు ఖర్చు చేసినట్టు జీవీఎంసీ పాలకులు లెక్కలు చూపించారు. ఈ మేరకు బిల్లుల చెల్లింపునకు స్టాండింగ్ కమిటీ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఏ క్షణంలోనైనా ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చేస్తుందనే భావనతో అధికారులు సమావేశం ఎజెండాలో ఏకంగా 141 అంశాలను చేర్చేశారు. వీటన్నింటినీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించేయడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం డిసెంబరు 26 నుంచి జనవరి 12వ తేదీ వరకూ సమ్మె చేశారు. ఆ సమయంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా తాత్కాలిక కూలీలు, వాహనాలను ఏర్పాటుచేసినా కార్మికులు అడ్డుకున్నారు. నగరంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి పారిశుధ్యం మరీ క్షీణించడంతో కార్మికుల సమ్మె ముగియడానికి ముందు ... మిగతా 6వ పేజీలో

రెవెన్యూ సిబ్బందికి రక్షణ కల్పిస్తాం

రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద పోలీస్ భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

- కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున
- కార్యాలయ పనుల నిమిత్తం ఇంటికి ఎవరినీ ఆహ్వానించవద్దని సిబ్బందికి హితవు

ఆరిలోవ, ఫిబ్రవరి 7: జిల్లాలో పనిచేసే రెవెన్యూ సిబ్బంది రక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని, అందరూ ధైర్యంగా విధులు నిర్వర్తించేలా పని వాతావరణం కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున భరోసా ఇచ్చారు. దీనిలో భాగంగా రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద నిత్యం పోలీస్ భద్రత ఉండేలా చూడాలని నిర్ణయించామన్నారు. కార్యాలయ అభివృద్ధికి రూ.ఐదు లక్షలు కేటాయించామని, ఇందులో కొంత మొత్తం ... మిగతా 6వ పేజీలో

అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం

- రూ. 3 కోట్లతో 55వ వార్డులో కాలువలు, రోడ్ల నిర్మాణం
- కొరవడిన పర్యవేక్షణ..
- కాంట్రాక్టర్ ఇష్టారీతిగా పనులు

కంచరపాలెం, ఫిబ్రవరి 7 : అధికారుల పర్యవేక్షణ లోపంతో జీవీఎంసీ 55వార్డులో అభివృద్ధి పనులు నాణ్యతా లోపంతో సాగుతున్నాయి. వార్డు పరిధి రెడ్డి కంచరపాలెం, కొత్త వాడవీధి, జాషువానగర్, గంగన్న నగర్, ధర్మానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మాణ పనులను సుమారు రూ.3 కోట్ల నిధులతో ప్రారంభించారు. రెడ్డికంచరపాలెంలో రూ.18.5 లక్షలతో కాలువ నిర్మాణం, ధర్మానగర్‌లో రెండు కాలువలకు రూ.31 లక్షలు, తిక్కవానిపాలెంలో రోడ్ల నిర్మాణం కోసం రూ.36 లక్షలు, మరో రూ.13 లక్షలతో కాలువ నిర్మాణం, ధర్మానగర్‌లో రెండు సామాజిక భవనాల కోసం రూ. 38 లక్షలు కేటాయించారు. కోట్లాది రూపాయాల ప్రజాధనంతో చేపడుతున్న ఈ పనుల నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి తనిఖీ చేయాల్సి ఉంది. అయితే ఈ పనులకు అధికారులు శంకుస్థాపన జరిగిన తరువాత ఎక్కడా కనిపించకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పనుల నాణ్యతపై థర్డ్ పార్టీ సిబ్బంది తూతూ మంత్రంగా తనిఖీ చేసి తప్పుడునివేదికలు అందిస్తుండడంపై ప్రజలనుంచి ఆగ్రహం వ్యక్తం మవుతోంది. రోడ్లు, కాలువల్లో ఎక్కడికక్కడ డొల్లతనం కనిపిస్తున్నప్పటికీ అడిగే వారు లేక గుత్తేదారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు దృష్టిని సారించిపరిశీలించి పక్కాగా ని ర్మాణాలుజరిగేటట్టుచూడాలని స్థానికులు కోరుతున్నారు.


రెడ్డికంచరపాలెంలో నిర్మిస్తున్న కాలువ

కేవీ విద్యార్థినికి అభినందన


ప్రణవిను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంచరపాలెం, ఫిబ్రవరి 7 : భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏపీ ప్రభుత్వం ప్రదర్శించిన అభివృద్ధి శకటంలో పాల్గొన్న 104 కేంద్రీయ విద్యాలయం-2 విద్యార్థిని ఎం. ప్రణవికి అభినందన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాసులు, హెచ్‌ఎం రామశాస్త్రి చిన్నారి ప్రణవిను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రకాశ్, శివ కుమార్, వినోద్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత సుబ్బరాజు ఆదర్శనీయులు


సుబ్బరాజు చి త్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

అల్లిపురం, ఫిబ్రవరి 7: నిజాయితీ, నిబద్ధతతో సీపీఐ సీనియర్ నాయకుడు, జాతీయ బ్యాంకుల యూనియన్ పూర్వ నేత కాకర్లపూడి సుబ్బరాజు జీవిత ప్రయాణం సాగించారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. ఇటీవల మృతిచెందిన సుబ్బరాజు సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈకార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ సిద్ధాంతా లకు కట్టుబడి సుబ్బరాజు పనిచేసేవారని, ఆయనకు నేటితరం యువ కమ్యూనిస్టులు కార్యకర్తలు, నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, కె.సత్యంజనేయ, ఎస్.కె. రెహమాన్, క్షేత్రపాల్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆవర్తన పట్టిక దినోత్సవం


బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఆవర్తన పట్టిక దినోత్సవం బుధవారం నిర్వహించారు. కళాశాల విద్యార్థినులకు క్విజ్ పోటీలు ఏర్పాటుచేసి విజేతలకు ప్రిన్సిపాల్ డా.ఎస్.శోభారాణి బహుతులను ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అరుణపద్మ, బి.కల్యాణరాముడు, సంతోషి, అనూష, విద్యాకల్పన, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో లింగేశ్వరరావుకు స్వర్ణం

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 7: అఖిల భారత్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బీవీఎస్‌కే లింగేశ్వరరావు స్వర్ణ పతకం సాధించారు. ఇటీవల మొహాలిలో జరిగిన ఈ టోర్నీ పురుషుల 55 ప్లస్ డబుల్స్ ఫైనల్స్‌లో చెన్నైకు చెందిన డాక్టర్ మారన్ తంగవేలుతో కలిసి అద్భుతంగా రాణించి ఈ పతకం కైవసం చేసుకున్నారు. లింగేశ్వరరావు విజయంపై పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.


అవార్డుతో లింగేశ్వరరావు

'వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'


సంఘీభావం తెలుపుతున్న వెలమ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, మార్చి 7 : ఉత్తరాంధ్రలో వెలమ సామాజిక వర్గానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు సరైన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు చుక్క చినబాబు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర పరిధిలో 13 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ స్థానాల్లో తమ సామాజిక వర్గానికి టికెట్టు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో 32 లక్షలు జనాభా కలిగిన తమకు టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ , కాంగ్రెస్ తదితర అన్ని రాజకీయ ప్రధాన పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విశాఖలో 10 లక్షల మంది ఉన్నారన్నారు. విశాఖలోవెలమ సామాజిక భవనానికి సంబంధించిన జీవో జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు ఎర్ర సన్యాసినాయుడు, పాశల సూర్యనారాయణ, అనకాపల్లి అధ్యక్షులు కుంద్రపు సోమేశ్వరరావు, సిరికి పోతురాజు, మూడేడ్ల తమ్మునాయుడు, సిరికి కొండలరావు, జి.వెంకటరమేష్, పోలా ప్రసాద్, రంధి పరదేశినాయుడు, చొక్కాకుల రామకృష్ణ, తమటపు కృష్ణమూర్తి నాయుడు, మిడతాన వెంకటరమణమూర్తి, పరవాడ రమణ పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక వసతుల కల్పన: మేయర్


47వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

కంచరపాలెం, ఫిబ్రవరి 7 : జీవీఎంసీ 47వ వార్డు పరిధి కొండవాలు గ్రామాలైన సంజీవయ్య కాలనీ, జగజ్జీవన్ నగర్, రాంజీ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఉత్తర వైసీపీ నాయకుడు కేకే రాజు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో సామాజిక భవనాలకు మరమ్మతులు, రోడ్లు,కాలువల నిర్మాణం కోసం రూ.88.45లక్షల నిధులను కేటాయించినట్టు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. వార్డుల్లో మౌలిక వసతులతోపాటు అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, వసంతల అప్పారావు, గురువాజీ, కృపతో పాటు డీఈ భరణి, ఏఈ చాణక్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో రాత పరీక్షలు

కంచరపాలెం, ఫిబ్రవరి 7 : టెక్సాస్ ఇన్స్టుమెంట్ కంపెనీలో ఉద్యోగాల కోసం బుధవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు రాత పరీక్షలను నిర్వహించారు. ప్రాంగణ ఎంపికల్లో భాగంగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు చెందిన 103 మంది ఈ రాత పరీక్షలో పాల్గొన్నారు. ఈ పరీక్షలో ఎంపికైన వారికి ఈనెల 13న మౌఖిక పరీక్ష జరగనున్నది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఆరు నెలలు పాటు ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్ ఉంటుంది. ఈ కాలంలో నెలకు రూ.25వేలు స్టైఫండ్ చెల్లించనున్నారు. అనంతరం వార్షికవేతనం రూ.8.6 లక్షలు ప్యాకేజీ లభిస్తుంచనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు పేర్కొన్నారు.రాత పరీలో ఎలక్ట్రికల్ విభాగాధిపతి కేడీపీ నరసింహారావు, అధ్యాపకులు జ్ఞానప్రసూన, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

అల్లిపురం, ఫిబ్రవరి 7: జీవీఎంసీ 32వ వార్డులో జనసేన నాయకులు కందుల నాగరాజు ఆధ్వర్యంలో నేరెళ్ల కోనేరు వద్ద పేదలకు నిత్యావసర సరసరుకులు పంపిణీ చేశారు. అనంతరం పలు వార్డుల్లో పర్యటించి మహిళలకు చీరలు, తాళిబొట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి జగన్ అన్నీ అసత్యాలు చెబుతున్నారని, వీటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విశాఖలోని స్థిరాస్తులపై అప్పు ఎవరు తీరుస్తారు?

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, చోడవరం ఇన్‌చార్జి మూర్తియాదవ్


మాట్లాడుతున్న మూర్తి యాదవ్

మహారాణిపేట, ఫిబవరి 7: విశాఖ నగరంలో స్థిరాస్తులపై రూ. 25 వేల కోట్లు అప్పులు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి.. వీటికి సంబంధించి కనీసం వడ్డీలు సైతం చెల్లించటం లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, చోడవరం ఇన్‌చార్జి వీఎస్‌ఎన్ మూర్తి యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో రెండు నెలల్లో జరిగే ఎన్నికల అనంతరం జగన్ ఇంటికివెళ్లిపోతారని, అప్పుడు విశాఖలో ప్రజల ఆస్తులపై తీసుకువచ్చిన అప్పులను ఎవరు తీరుస్తారని ప్ర శ్నించారు, జగన్ రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి అన్ని విధాలా సర్వనాశనం చేశారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖను నిలువుగా దోచుకున్నారని ఆరోపించారు. జీవీఎంసీ పరిధిలో బీపీఎస్ కోసం వసూలు చేసిన డబ్బు ఏం చేశారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. విశాఖ నగరంలో రూ. 50 వేల కోట్ల ఆస్తులను తారుమారు చేసి జగన్ కుటుంబం దోచుకుందన్నారు. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించే రోజులు సమీపించాయని ఆయన హెచ్చరించారు.

ఫైనల్స్‌కు చేరిన టెన్నిస్ టోర్నమెంట్


పోటీపడుతున్న క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: సీఎంఆర్ అయిష్ట టెన్నిస్ టోర్నమెంట్ 17వ సీఎంఆర్ ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతోంది. బుధవారం అన్ని విభాగాల్లోని డబుల్ ,సింగిల్స్ మ్యాచ్‌లు ఫైనల్స్‌కు వచ్చాయి. అయిష్ట నుంచి సెక్రటరీ డీఎస్‌ఎన్ రాజు, రాధాకృష్ణమూర్తి 70 ప్లస్ డబుల్ విభాగంలో ఫైనల్ గెలుపొందారు. 65ప్లస్ సింగిల్స్‌లో సుదర్శన్ గెలుపొందారు. 70 ప్లస్ విభాగంలో సేతు గెలుపొందారు. మిగతా విభాగంలో జరగాల్సిన ఫైనల్ మ్యాచ్‌లు గురువారం ఆఫీసర్ క్లబ్‌లో జరుగనున్నాయి. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు.ఈ కార్యక్రమానికి మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు పాల్గొననున్నట్టు అయిష్ట అధ్యక్షులు ప్రేమచంద్ తెలిపారు.

విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు


విద్యార్థులకు పరీక్షిస్తున్న వైద్యులు

సీతమ్మధార, ఫిబ్రవరి 7: సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్, జూనియర్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం, కృషి వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.మూడు రోజుల పాటు 1200 మంది విద్యార్థులకు వైద్య సేవలందించనున్నట్టు ప్రధానోపాధ్యాయులు రామ్‌ప్రసాద్ తెలిపారు. కార్డియాలిజిస్ట్ డాక్టర్ పీఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ అమృత వైద్య పరీక్షలు చేస్తున్నట్టు వివరించారు.

అప్పులతో కౌలు రైతు ఆత్మహత్య


అప్పలరాజు (ఫైల్ ఫొటో)

పద్మనాభం, ఫిబ్రవరి 7: విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో అప్పులు తీర్చలేక కౌలు రైతు ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం..గ్రామానికి చెందిన పి.అప్పలరాజు (41) స్థానికంగా రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి తోట వేసి, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతినడంతో అనుకున్న దిగుబడి లేక నష్టాలు వచ్చాయి. దీంతో చేసిన అప్పులు తీర్చలేక దిగులుతో ఈనెల ఐదో తేదీన పొలంలోనే పురుగుల మందు తాగారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం అప్పలరాజు మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్ శ్రీధర్ కేసు నమోదు చేశారు.

రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ, ఫిబ్రవరి 7: విశాఖపట్నం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గుడే పోతన్న (45) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్టు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం...అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బద్దంబూరు గ్రామానికి చెందిన పోతన్న గత ఏడాది జూలైలో గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడికి పాడేరు కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు సెంట్రల్ జైలుకు తరలించారు. జైలుకు వచ్చిన సమయంలోనే అనారోగ్యంగా ఉన్నాడు. మంగళవారం ఉదయం అస్వస్థతకు గురవ్వడంతో జైలు వైద్యులు పరీక్షలు జరిపి, అతనికి గుండె సంబంధిత సమస్య ఉన్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. కాగా జైలు అధికారులు కొట్టడం వల్లే పోతన్న చనిపోయినట్టు అతని కుటుంబీకులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

బొగ్గన వారి బొంకులు

... 5వ పేజీ తరువాయి

భీమిలిలో జెట్టీ నిర్మిస్తామని ప్రకటించి శంకుస్థాపన మాత్రం చేశారు. అయితే దానికి ఇప్పటివరకూ భూసేకరణ పూర్తి కాలేదు. వాస్తవం ఇలా ఉండగా...కోట్ల రూపాయలతో ఏదో చేసేశామని బల్లలు చరిచారు.

విశాఖ విమానాశ్రయం వారి ఖాతాలోనే

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. వాస్తవానికి విమానాశ్రయానికి చంద్రబాబునాయుడు హయాంలోనే శంకుస్థాపన జరిగింది. నాలుగేళ్లు దానిని పట్టించుకోకుండా వదిలేసి తొమ్మిది నెలల క్రితం దానికి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ పనులు ఇటీవలే మొదలయ్యాయి. అదలా ఉంచితే..విశాఖ విమానాశ్రయాన్ని కూడా తామే అభివృద్ధి చేశామని బుగ్గన ప్రకటించారు. ఇక్కడి విమానాశ్రయం నేవీ ఆధ్వర్యంలో ఉండగా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా నిధులతో అభివృద్ధి చేశారు. విమానాశ్రయం బయట బస్టాపు నిర్మించి, అక్కడ సీఎంకి స్వాగతం అంటూ పెద్ద హోర్డింగ్ పెట్టుకొని...విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశామని చెప్పుకొంటున్నారు.

డబ్ల్యుఎన్ఎస్, పల్సస్ కొత్త కంపెనీలట

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక 65 కొత్త ఐటీ కంపెనీలు ఏర్పాటయ్యాయని, వాటి ద్వారా 47,908 మందికి ఉద్యోగాలు వచ్చాయని మంత్రి ప్రకటించారు. విశాఖలో అదానీ డేటా సెంటర్, డబ్ల్యుఎన్ఎస్, పల్సస్, రాన్‌స్టాండ్, ఇన్ఫోసిస్ సంస్థలు ఏర్పాటయ్యాయని వివరించారు. అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు చంద్రబాబునాయుడు హయాంలోనే ఒప్పందం జరిగింది. ఆయన శంకుస్థాపన కూడా చేశారు. అయితే సీఎం జగన్ గత మే నెలలో దానికి మరోమారు శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ అక్కడ పనులు మొదలు కాలేదు. ఏ సెంటరూ రాలేదు. ఇక డబ్ల్యుఎన్ఎస్, పల్సస్ సంస్థలు చాలా పాతవి. అవి తెలుగుదేశం ప్రభుత్వం నుంచే విశాఖలో ఉన్నాయి. కొత్తవి కానే కావు. ఇన్ఫోసిస్ సంస్థ వారి ఉద్యోగుల కోసం విశాఖలో ఓ సెంటర్ ఏర్పాటు చేసుకుంది. వారికి కనీసం భవనం గానీ, భూమి గానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. కానీ తామే దానిని తీసుకువచ్చినట్టు ఐటీ మంత్రి సహా అంతా అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. ఐటీ సంస్థలకు ఉద్యోగులను సమకూర్చే రాన్‌స్టాండ్ మాత్రమే వీరి హయాంలో వచ్చింది. ఉత్తరాంధ్రాలో మానవ వనరులు అధికంగా ఉండడం వల్ల వారు వచ్చారు. ఈ ప్రభుత్వంవారికి కూడా ఇచ్చిందేమీ లేదు.

రుషికొండలో బ్లూ ఫ్లాగ్ ఎగరేశారట!!

రుషికొండ బీచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం చొరవ వల్ల బ్లూ ఫ్లాగ్ హోదా వచ్చిందని మంత్రి బుగ్గన చెప్పుకొచ్చారు. రుషికొండ బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వగా, వాటితో దానిని అభివృద్ధి చేశారు. అందుకే దానికి బ్లూ ఫ్లాగ్ హోదా వచ్చింది. ఆ పేరును చెడగొడుతూ రుషికొండకు బోడిగుండు కొట్టించి అక్కడ పర్యాటక శాఖ రిసార్ట్ అంటూరూ.450 కోట్లతో సీఎంక్యాంపు కార్యాలయాలు కట్టించుకున్నారు.

మహా మాయ

... 5వ పేజీ తరువాయి

మూడు రోజులు మాత్రం కొంతమేర వాహనాలు, జేసీబీలతో చెత్తకుప్పలను తొలగించారు. అయితే సమ్మె కాలంలో తాత్కాలిక కూలీలు, జేసీబీలు, టిప్పర్లను ఏర్పాటు చేశామని, అందుకోసం రూ.3.2 కోట్లు ఖర్చు అయిందంటూ ప్రజారోగ్య విభాగం అధికారులు బిల్లు తయారుచేశారు. ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్లకు చెల్లించాలంటూ పలు కేటగిరీల కింద ప్రతిపాదనలు తయారుచేసి స్టాండింగ్ కమిటీ ఆమోదానికి పెట్టగా సభ్యులు ఒక్కరు కూడా అభ్యంతరం వ్యక్తంచేయకుండా ఆమోదించేసింది. అలాగే మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకూ బీఆర్‌టీఎస్ రోడ్డుపై బీటీ హాట్‌మిక్స్ వేసేందుకు సుమారు రూ.రెండు కోట్లను ఖర్చు చేసేందుకు కమిటీ ఆమోదించింది. అలాగే బీచ్‌రోడ్డులోని మారిటైమ్ మ్యూజియం మరమ్మతులకు రూ.50 లక్షలు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి వివిధ వార్డుల్లో రూ.21.63 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

దర్యాప్తు ముగిసినట్టేనా!?

... 5వ పేజీ తరువాయి

రమణయ్యను ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందనేది విచారణలో గంగారావు కచ్చితంగా చెప్పి ఉంటాడు. ఒకవేళ చెప్పకపోతే పోలీసులు తమదైన శైలిలో సమాధానం రాబడతారు. అయితే ఆ వివరాలను పోలీసులు బయటపెట్టడం లేదు. పైగా ఇంకా విచారించాల్సి ఉంటే తూతూమంత్రంగా కస్టడీ పిటిషన్ వేసి వదిలేయకుండా, ఉన్నతాధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకునేవారని, ఈ కేసుల్లో ఇంతవరకూ అలాంటి పరిస్థితి కనిపించలేదని అభిప్రాయపడుతున్నారు. గంగారావును అరెస్టు చేయడంతో ఈ కేసు దర్యాప్తును పోలీసులు ముగించేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని పేర్కొంటున్నారు. ఈ కేసులో దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడించడానికి పోలీసులు ఆసక్తి చూపకపోవడం అనేక అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది.

నగరంలో నాకాబందీ

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయని, జీఆర్‌టీ, ఖజానా తదితర షాపులకు సంబంధించినవిగా భావిస్తున్నట్టు పోలీస్ అధికారులు వెల్లడించారు. వారు జీఎస్టీ సక్రమంగా కట్టారా?, లేదా?, ఆ పత్రాలకు, వారు చూపుతున్న సరకుకు వివరాలు సరిపోయాయా?, లేదా?...అన్న విషయాలు పరిశీలిస్తున్నారు. అదేవిధంగా రైల్వేస్టేషన్ సమీపంలో రూ.4.5 లక్షలు నగదు, ఆరు మద్యం సీసాలు, మద్దిలపాలెం జంక్షన్‌లో రూ.4.29 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధి భగత్‌సింగ్‌నగర్ వద్ద ఆటోలో 860 కిలోల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. ఇక సెబ్ అధికారులు నిర్వహించే రోజువారీ తనిఖీల్లో భాగంగా ఫోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనదారుడి వద్ద రూ.5.97 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. నగరంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలను జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ-1 మణికంఠ చందోలు, జోన్-2 డీసీపీ ఎం.సత్యనారాయణ పర్యవేక్షించారు.

రెవెన్యూ సిబ్బందికి రక్షణ కల్పిస్తాం

... 5వ పేజీ తరువాయి

వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామన్నారు. రూరల్ తహసీల్దారుగా పనిచేసిన సనపల రమణయ్య బదిలీ అక్కడ నుంచి అయిన రెండు రోజులకే హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యం లోనే కలెక్టర్ బుధవారం రూరల్ తహసీల్దారు కార్యా లయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు. హత్య పూర్వాపరాలను సిబ్బంది నుంచి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో అప్పుడప్పుడు క్లిష్టమైన పరిస్థితులు ఎదురవు తాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. కార్యాలయ పనుల నిమిత్తం ఎవరినీ ఇంటికి ఆహ్వానించవద్దని హితవు పలికారు. వీఆర్వోలు ఒకచోట కూర్చొని విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యాలయాన్ని ఆధునికీకరించే పనులు త్వరలో చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి ఉన్నారు.

నిద్దరోతున్న నిఘా వ్యవస్థ

... 5వ పేజీ తరువాయి

అందజేస్తుంటారు. వీటిని బట్టి పోలీస్ అధికారులు కార్యాచరణ రూపొందించి అమలుచేస్తారు. ఒకవేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిణామాలు జరిగే అవకాశం ఉందనో...ప్రజాధనం దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందనో...ప్రజల ప్రాణాలు, జీవనానికి ఇబ్బంది తలెత్తే అవకాశం ఉందనో తెలిస్తే ముందస్తు చర్యలు తీసుకుంటారు. అందువల్లనే స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పోస్టింగ్‌లు ఇచ్చేముందు ఆయా సిబ్బంది గతచరిత్ర, పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు, కేసులు లేవని తేలడంతోపాటు విధినిర్వహణలో నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరిస్తారనే నమ్మకం కుదిరితేనే ఉన్నతాధికారులు వారికి పోస్టింగ్ ఇస్తారు. అయితే కాలక్రమేణా ఆ రెండు విభాగాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సమాచార సేకరణపై నిర్లక్ష్యం

స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేస్తున్న వారిలో కొంత మందిని మినహాయిస్తే మిగిలిన వారంతా మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శాఖాపరమైన చర్యలకు గురైన వారు, అవినీతి కేసుల్లో ఉన్నవారు సైతం ఆ విభాగాల్లో పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. పోలీస్ స్టేషన్లలో ఏళ్ల తరబడి పనిచేసిన వారిపై అనేక రకాల అభియోగాలు ఉంటాయి. ఇటువంటి వారంతా ఇంకా స్టేషన్లలో పని చేస్తే ఉన్నతాధికారుల నుంచి ఇబ్బందులు, వేధింపులు తప్పవనే ఉద్దేశంతోనే, తమ ఆస్తులపై ఏసీబీ ఏక్షణంలోనైనా దాడులు చేసే ప్రమాదం ఉందనో ముందుజాగ్రత్తగా నాన్‌ఫోకల్‌లోకి వెళ్లిపోవాలని యత్నిస్తుంటారు. అలాంటివారంతా స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాల్లోకి వెళ్లిపోయేందుకు ఆసక్తి చూపుతారు. తమలాంటివారికి ఆయా విభాగాల్లో పోస్టింగ్‌లు దక్కవని తెలిసినప్పటికీ, తమకు పరిచయస్తులు, సన్నిహితులుగా ఉండే ఆయా విభాగాల్లోని ఉన్నతాధికారుల సిఫారసుతో పోస్టింగ్ సాధించుకుంటున్నారు.

పోస్టింగ్ వచ్చిన తర్వాత తమకు కేటాయించిన ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, రౌడీషీటర్లు, రాజకీయనేతల కదలికలు, పోలీస్, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిపోయేవారి సాధక బాధకాలు, అధికారులు, సిబ్బంది వారితో వ్యవహరించేతీరు, అవినీతి వంటి అంశాలపై దృష్టి పెట్టి సమాచారం సేకరించడానికి మాత్రం ఇష్టపడడం లేదు. తమ పరిధిలో జరిగే విలేకరుల సమావేశాలు, ధర్నాలకు హాజరై విలేకరుల మాదిరిగా కూర్చొని సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు పంపించి తమ పని అయిపోయిందన్నట్టు భావిస్తున్నారు. అలాగే అక్కడ కనిపించే విలేకరులను ఇతర విషయాల గురించి అడిగి వారిచ్చే సమాచారం ఎంతవరకు సరైనదో నిర్ధారించుకోకుండానే దానిని తాము సేకరించినట్టు ఉన్నతాధికారులకు చెప్పేస్తున్నారు.

దీనివల్ల నగరంలో జరిగే భూకబ్జాలు, రౌడీషీటర్ల ఆగడాలు, గంజాయి, మత్తుమందుల రవాణా వంటి సమాచారం తమకు చేరడం లేదని పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

ఉత్తరాంధ్ర ఆత్మగౌరవ యాత్ర


మాట్లాడుతున్న ఉత్తరాంధ్రపార్టీ అధ్యక్షుడు రామారావు

అక్కయ్యపాలెం, ఫిబవరి 7: ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్రం సాధించాలనే లక్ష్యం తో ఈనెల 29 వతేదీనుంచి 23 రోజుల పాటు ఆత్మగౌరవ యాత్ర నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మెట్టరామారావు తెలిపారు. ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవం నిలపడం కోసం గళం విప్పాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ 53స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. తమ పార్టీ అభ్యర్థుల గెలుపు ద్వారా ప్రత్యేక రాష్ట్ర హోదాను సాధించుకోగలమని అన్నారు.ఈ అత్మగౌరవ యాత్ర అక్కయ్యపాలెం పార్టీ ఆఫీసు నుంచి ప్రారంభమై స్టీల్‌ప్లాంట్ శిబిరం వద్ద సంఘీభావం తెలిపి తుని, కాకినాడ, అమలాపురం మీదుగా దవళేశ్వరం చేరుకుని గోదావరి జలాలను సేకరించి వాటితో ఉత్తరాంధ్ర అంతా యాత్ర సాగుతుందన్నారు.

చరిత్రకు ప్రతీక మూడుదారులు పుస్తకం

సీతంపేట, ఫిబ్రవరి 7: ముగ్గురు ముఖ్యమంత్రుల పాలన చరిత్రకు ప్రతీకగా మూడు దారులు పుస్తకం నిలుస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ రచించిన మూడు దారులు పుస్తక పరిచయ సభను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఏయూ జర్నలిజం శాఖ విశ్రాంత ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ పి.బాబివర్ధన్, పాత్రికేయ ప్రముఖులు మంగు రాజగోపాల్, పాత్రికేయులు బీఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కయ్యపాలెం, ఫిబవరి 7: గ్రేటర్ 44వ వార్డు అబీద్ నగర్‌లో రూ.38.44 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మన్ కేకే రాజు .. ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్‌తో కలసి శంకుస్థాపనచేశారు. అనంతరం ధాన్ ఫౌండేషన్ భవనం, పునర్నించిన జిమ్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. నాయకులు హబీబు, మహాదాస్ గోపి, పి. గోపి, సీతారాం. జి.వెంకటరావు, బషీర్, ప్రకాష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో 16న కార్మిక సమ్మె

న్యాయ సమ్మతమైన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

ఉక్కు యాజమాన్యానికి నోటీసు అందజేసిన కార్మిక సంఘాల నాయకులు



ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 7: ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 16న కార్మిక సమ్మె చేయనున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 11 వేల మంది నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే మరో పదివేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. ఉద్యోగులు, కార్మికుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను ఉక్కు యాజమాన్యం పరిష్కరించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటూ ఇప్పటికే ఉక్కు యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేయడంతో పాటు ధర్నాలు, ఆందోళనలు చేశారు. ఈ క్రమంలో యాజమాన్యానికి ఈ నెల 16న సమ్మె చేస్తున్నట్టు నోటీసు కూడా కార్మిక సంఘ నాయకులు అందజేశారు. కాగా గతంలో కూడా ఇదే మాదిరిగా రెండు రోజుల పాటు సమ్మె చేయాలని నిర్ణయించినప్పటికీ జాతీయ కార్మిక సంఘాలు వెనక్కి తగ్గటంతో ఆందోళనను విరమించుకున్నారు.

ఇవీ డిమాండ్లు..

- 2017వ సంవత్సరం నుంచి కొత్త వేతనాలు అమలు చేయాలి
- జిందాల్ ఎంవోయూను రద్దు చేసి ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపాలి
- తక్షణమే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి
- నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలి
- కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి
- ఉద్యోగులకు ఇంక్రిమెంటు చెల్లించాలి
- ఏ ఒక్క యూనిట్‌ను ప్రైవేటీకరణ చేయరాదు
- వేతన ఎరియర్స్‌తో పాటు అలవెన్స్‌లను ఇవ్వాలి
- 28 శాతం ప్రోత్సాహకాలను అందజేయాలి.
- ఇలా 18 సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేయనున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

-ఎం.ఈశ్వరరావు, ఉక్కు ఉద్యోగి



ఉక్కు కర్మాగారం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. ప్లాంట్ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ఉద్యోగులు ముందుకు సాగుతున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్లాంట్‌ను కాపాడుకుంటూ, మరింత ప్రగతి సాధించే దిశగా పనిచేస్తున్నారు. వీరి సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రావాలి.

ఉత్తరాంధ్ర అభివృద్ధి ఉక్కు కర్మాగారంతోనే సాధ్యం

ప్రజా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట రామారావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మెట్ట రామారావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 7: ఉత్తరాంధ్ర అభివృద్ధి ఉక్కు కర్మాగారంతోనే సాధ్యమని, అందువల్ల దీనిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,091వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన దీక్షా శిబిరానికి విచ్చేసి కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం రామారావు మాట్లాడుతూ ప్రజల సంపదలను దోచుకొనే హక్కు పాలకులకు ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఉండే సహజ వనరులతో పాటు ప్రజా సంపదలను కూడా అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శతవిధాల యత్నిస్తుండడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు పోరాటాలను మరింత ఉధృతం చేయాలని కోరారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రం తమ వద్దనున్న భూములను అమ్మేందుకు యత్నిస్తే ప్రజల, ప్రభుత్వ అవసరాలకు భూమి కొరత ఏర్పడి పరిశ్రమల ప్రగతికి విఘాతం ఏర్పడుతుందన్నారు. అందువల్ల ప్రభుత్వ భూములను పరిరక్షించి పరిశ్రమలను నెలకొల్పాలన్నారు. ఉక్కు ఉద్యమంలో ఉద్యోగులు, కార్మికులతో పాటు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మహిళలు, యువత భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తౌడన్న, శ్యామ్, రమణ, పూర్ణచంద్రరావు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా నీటి కోసం తిప్పలు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న అశోక్‌నగర్ వాసులు

పెదగంట్యాడ: ఫిబ్రవరి 7: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని అశోక్‌నగర్ కాలనీని తాగునీటి సమస్య నాలుగేళ్లుగా వేధిస్తోంది. తమకు తాగునీటిని అందించాలని కాలనీవాసులు జీవీఎంసీ అధికారులు, ఎమ్మెల్యేను, కార్పొరేటర్‌ను వేడుకుంటూ వినతులు సమర్పించినా ఇప్పటివరకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండవాలు ప్రాంతమైన అశోక్‌నగర్ కాలనీలో 11 వీధులు, 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రియదర్శని కాలనీ దగ్గర నున్న పంప్ హౌస్ నుంచి పైపు లైన్ల ద్వారా అశోక్‌నగర్ కాలనీకి నీటి సరఫరా జరుగుతుంది. ఇళ్లకు ఉన్న కొళాయిల ద్వారా అందరూ నీటిని పట్టుకుంటారు. అయితే పంప్‌హౌస్ నుంచి కాలనీకి నీటిని సరఫరా చేసే మెయిన్ పైపు లైన్ రెండుచోట్ల పగిలిపోవడం, కాలనీలో వీధిలోనూ మరో రెండుచోట్ల పైపు లైన్ పగిలిపోయి నాలుగేళ్లయినా ఇంతవరకు పట్టించుకునే నాథులే కరువయ్యారు. కాలనీకి నీరు విడిచి పెట్టినప్పుడు పైపు లైన్లు పగిలిపోవడం వల్ల అన్ని ఇళ్లకు నీటి సరఫరా సజావుగా సాగడం లేదు.

ప్రధాన పైపులైన్‌కు దగ్గరగా ఉన్న సుమారు వందిళ్లకు మాత్రమే నీరందుతుంది. మిగిలిన 300 ఇళ్లకు నీటి సరఫరా జరగడం లేదు. దీంతో ప్రజలు తాగునీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. పలుచోట్ల ఉన్న బోరింగుల నుంచి కూడా నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ట్రిబ్యునల్ తీర్పును అమలు చేయాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 7: తొలగించిన 28 మంది కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును విశాఖ డెయిరీ యాజమాన్యం తక్షణమే అమలు చేయాలని డెయిరీ కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1983 నుంచి డెయిరీలో కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికుల్లో 40 మందిని పర్మినెంట్ చేసిన యాజమాన్యం మిగతా 28 మందిని మాత్రం పర్మినెంట్ చేయకుండా విస్మరించిందని యూనియన్ అధ్యక్షుడు ఈ.కనకరాజు, ప్రధాన కార్యదర్శి వరదాడ వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము కోర్టును ఆశ్రయించగా, 2017లో ట్రిబ్యునల్ తమను పర్మినెంట్ చేయాలని ఆదేశాలను జారీ చేసినా దానిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. దీనిపై తాము బుధవారం మరోసారి జిల్లా కోర్టును ఆశ్రయించామని, ఇకనైనా డెయిరీ యాజమాన్యం కోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయానికి తొలగనున్న వసతి సమస్య?

- శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో స్థలం గుర్తింపు
- త్వరలో భవన నిర్మాణ పనులు



ప్రస్తుతం ములగాడ హౌసింగ్ కాలనీలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం



కొత్త భవనానికి రామ్‌నగర్‌లో గుర్తించిన స్థలం

మల్కాపురం, ఫిబ్రవరి 7: గ్రేటర్ విశాఖ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో ఉన్న ములగాడ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని త్వరలోనే ఇక్కడి నుంచి 58వ వార్డు శ్రీరామ్‌నగర్‌కు తరలించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. శ్రీరామ్‌నగర్‌లోని రజకుల దోబి ఘాట్‌కు అనుకొని ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మించనున్నారు. ఈ మేరకు ఇటీవల ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్ ఈ స్థలాన్ని పరిశీలించారు. ములగాడ హౌసింగ్ కాలనీలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం మూడు ఇరుకైన గదులలో సిబ్బంది ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వసతి సమస్య నెలకొంటున్న దృష్ట్యా సిబ్బంది అనేకసార్లు ప్రత్యేకంగా మండల కార్యాలయ భవనం నిర్మించాలని కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. ఈ స్థితిలో కలెక్టర్ స్పందించి కొత్తగా భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని ఆర్డీవోకు ఆదేశించారు. ఈనేపథ్యం ఆయన కొద్దిరోజుల కిందట 58వ వార్డులో స్థలాన్ని పరిశీలించి కలెక్టర్‌కునివేదిక ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఇక్కడ మండల రెవెన్యూ కార్యాలయం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులను కూడా కేటాయించినట్టు తెలిసింది. త్వరలో ఈ భవనం పూర్తయితే తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి ఇబ్బందులు తప్పనున్నాయి.

ములగాడ తహసీల్దార్‌గా శ్రీనివాస్ మిశ్రా



బాధ్యతలు స్వీకరించిన మిశ్రా

మల్కాపురం, ఫిబ్రవరి 7: ములగాడ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా శ్రీనివాస్ మిశ్రా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మిశ్రాను తొలుత విశాఖ రూరల్ తహసీల్దార్‌గాప్రభుత్వం నియమించారు. అయితే, అక్కడ తహసీల్దార్‌గా ఉంటూ బదిలీ అయిన సనపల రమణయ్య హత్యకు గురయ్యారు. దీంతో రూరల్ తహసీల్దార్‌గా అక్కడ తాను బాధ్యతలు చేపట్టలేనని, తన ఆరోగ్యం సహకరించడం లేదని కలెక్టర్‌ను మిశ్రా వేడుకుంటూలేఖ రాసుకున్నారు. ఈనేపథ్యంలో ములగాడకు కేటాయించిన శివనారాయణను విశాఖ రూరల్ తహసీల్దార్‌గా నియమించారు. ములగాడలో శ్రీనివాస్ మిశ్రా తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. అయితే ఇక్కడ గతంలో ఉన్న తహసీల్దార్ డొడ్డి వీరభద్రరావు వీఎం ఆర్డీఏ (ఉడా) బదిలీ అయ్యారు.

16న భారత్ బంద్ జయప్రదం చేయండి

- టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు



మాట్లాడుతున్న లక్ష్మణరావు

మల్కాపురం, ఫిబ్రవరి 7: అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన చేపడుతున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక రామకృష్ణపురం హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్మికులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. పరిశ్రమల్లో కనీస వేతనాలులేవని, వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగితే సదరు కార్మికుడు, ఆ కుటుంబ నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు నాగార్జున రావు, కె.ఆదినారాయణ (ఆది),పొక్కుల కృష్ణ,పెద్దాడభూలోకరాజు, కోనశేఖర్, రంజాన్ ప్రసాద్, ఉరుకూటి హరి, సురేష్, కె.తారక్, కోశాధికారి చెల్లిబోయిన శ్రీను పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

వేపగుంట ఫిబ్రవరి 7: జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని భరత్‌నగర్ దరి శ్రీ లక్ష్మీనరసింహనగర్‌లో కార్పొరేటర్ పి.వి.నరసింహం బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చా రు. రహదారులు, వీధిదీపాల సమస్యలను అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక గోపీజనవల్లభస్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకొని పూజలు చేశారు. నాయకులు మా మిడి దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు, ఈశ్వరరావు, అర్చకులు కె.వి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెందుర్తి, ఫిబ్రవరి 7: పెందుర్తి ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 11 ఆయా పోస్టులు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో నీలవేణి బుధవారం తెలిపారు. సరిపల్లి, గొరపల్లి, నాతయ్యపాలెం, గుడ్లవానిపాలెం, చింతలగ్రహారం, చిన్నపాలెం, నారావానిపాలెం, కర్నవానిపాలెం, నేలిముక్కు, పెదమడక, దల్లివానిపాలెంలలోని ఆయా పోస్టులకు వారు ఈనెల 15న లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

కల్యాణ మండపం నిర్మాణ పనుల పరిశీలన

గోపాలపట్నం, ఫిబ్రవరి 7: గ్రేటర్ 92వ వార్డు పద్మనాభనగర్‌లో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపం పనులను జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, స్థానిక వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గెడ్డల ఆక్రమణతో సమస్యలు



వర్షాకాలంలో రోడ్డుపైకి వచ్చిన శ్రీరామ్‌నగర్ గెడ్డ నీరు (ఫైల్)

గోపాలపట్నం, ఫిబ్రవరి 7 : గ్రేటర్ 92వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో గెడ్డలు ఆధునికీకరణకు నోచుకోక వర్షాలు కురిస్తే పొంగి ప్రవహించి కోతకు గురవుతున్నాయి. గోపాలపట్నం కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చే వర్షంనీరు పల్లం ప్రాంతాలకు ప్రహించడానికి వీలుగా సహజసిద్ధంగా ఏర్పడిన గెడ్డలు జనావాసాలతో ఇప్పటికే ఆక్రమణలకు గురై కుచించుకుపోయా యి. దీంతో వర్షాలు కురిసే సమయంలో నీరు, సాధారణ రోజుల్లో మురుగునీరు సజావుగా ప్రహించకపోవడంతో తరచూ నీరు పొంగి జనావాసాల మధ్యకు వస్తున్నాయి. గెడ్డలో పూడికలు పేరుకు పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. 92వ వార్డులో శ్రీరామ్‌నగర్ నుంచి కొత్తపాలెం అండర్ పాత్‌వే వరకూ గల గెడ్డ, వెంకటాపురం, నందమూరినగర్, జనతాకాలనీ ప్రాంతాల్లో గల గెడ్డల అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ గెడ్డలను ఆధునీకరిస్తే ఆక్రమణలు తగ్గడంతో పాటు జనాలకు కూడా ఇబ్బందులు తీరుతాయి. దశల వారీగానైనా గెడ్డలను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్

సమస్యల పరిష్కారానికి కృషి

అగనంపూడి, ఫిబ్రవరి 7: వార్డు పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన వార్డు పరిధి ప్రశాంతినగర్, పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగు పోయేందుకు దారి లేదని, దీంతో ఇళ్ల మధ్యే రోజుల తరబడి నిలిచిపోతుందన్నారు. అలాగే తాగునీటి సమస్య ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన స్టీల్‌ప్లాంట్ ప్రహరీని ఆనుకుని ఉన్న డ్రైనేజీ పూడ్చివేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

వచ్చేనెల 20 నుంచి పద్మనాభుని కల్యాణోత్సవాలు

పద్మనాభం, ఫిబ్రవరి 7: పద్మనాభంలోని అనంత పద్మనాభుని కల్యాణోత్సవాలు మార్చి 20 నుంచి నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈమేరకు బుధవారం వారు కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సీతారామాంజనేయస్వామి మాట్లాడుతూ ఈఏడాది మార్చి 20 నుంచి 26 వరకు అనంతుని కల్యాణోత్సవాలు నిర్వహించడానికి సంకల్పించామన్నారు. 21న స్వామివారి కల్యాణం, 23న తెప్పోత్సవం, 24న రథోత్సవం,25న డోలోత్సవం, 26 పుష్పయాగం జరుగుతాయని తెలిపారు. దేవస్థానం ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణను కమిటీ తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీపీ కె. రాంబాబు స్పందిస్తూ దేవస్థానం కొన్ని బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఉత్సవం ఘనంగా నిర్వహించడానికి కమిటీపరంగా తాము చేయాల్సిన పనులు, బాధ్యతలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో భీమిలి ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు జీపీవై నాయుడు, శేరిఖండం సర్పంచ్ చిన్నారావు, కమిటీ సభ్యులు పద్దు, ఎర్నాయుడు, పైడిరాజు, నారాయణరావు, సత్యనారాయణ, అప్పలనాయుడు, నర్సింహనాయుడు పాల్గొన్నారు.

గిరిజన పరిశోధన సంస్థ ఈడీని కలిసిన అల్లూరి సేవా సంఘం ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 7: జిల్లా గిరిజన, పరిశోధన సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబును అల్లూరి సీతారామరాజు సేవా సంఘం ప్రతినిధులు బుధవారం కలిసి పలు సమస్యలపై విన్నవించారు. గాము సోదరుల మనవడైన బోడి దొర ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఈడీ తక్షణమే పాడేరు ఐటీడీఏ పీవోకు ఈ విషయాన్ని తెలపడంతో ఆరోగ్య సిబ్బంది బోడి దొర ఇంటికి వద్దకు వెళ్లి ఆయనకు తగిన వైద్యం అందించారని ప్రతినిధులు పేర్కొన్నారు. తక్షణమే స్పందిచినందుకు ఈడీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అంకెల గారడీ.. రాష్ట్ర బడ్జెట్': కాంగ్రెస్

గోపాలపట్నం, ఫిబ్రవరి 7: శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రజలకు నిరాశను మిగిల్చిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోడదాసి సుధాకర్ అన్నారు. అంకెల గారడీ తప్ప ఈబడ్జెట్‌తో రాష్ట్ర ప్రజలకు ఒరిగే లేదని అన్నారు. నవరత్నాల పేరిట కొంతమందికే సంక్షేమ పథకాలు అందిస్తూ రా ష్ట్రంలోని అందరికీ మేలు చేకూర్చుతున్న వైసీపీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రజల్ని మోసం చేసే విధంగానే బడ్జెట్ ఉందని అన్నారు. ఇది ముమ్మాటికీ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నిరాశ కలిగించిందని అన్నారు.

సినిమా గైడ్

- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 32, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 50, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 18, క్యారెట్ 24, దొండకాయలు 36, బంగాళదుంపలు 22, అరటికాయ (పెద్దది) 4, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 86, బరబాటి 30, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 330, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28, కంద 54, దేముడుచిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	108
ఫారం ధర	128
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	236

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



వికసిత భారత్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

వికసిత భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం

గాజువాక, ఫిబ్రవరి 7: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత భారత్ సంకల్పయాత్రను బుధవారం 66వ వార్డు పరిధి బీసీ రోడ్డులో భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు ఈ యాత్ర చేపడుతున్నామన్నారు. పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. అనంతరం వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

జోనల్ పరిధిలో కమిషనర్ పర్యటన

గాజువాక, ఫిబ్రవరి 7: జీవీఎంసీ గాజువాక జోనల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ ప్రసాద్ బుధవారం పర్యటించారు. పారిశుధ్య కార్మికుల పనితీరు, హాజరు పట్టిక వంటి అంశాలపై ఆరా తీశారు. తెలుసుకున్నారు. ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. తడి-పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట పలు విభాగాల అధికారులు ఉన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి విరాళం

గాజువాక, ఫిబ్రవరి 7: పాతకర్నవానిపాలెంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపం కోసం బీజేపీ మండల అధ్యక్షుడు గూటూరు శంకరరావు కటుంబ సభ్యులు రూ.50,116 నగదు అందజేశారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు గుడివాడ అమ్మన్న, కరణంరెడ్డి నరసింగరావులకు నగదు అందజేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి పూర్తి సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు.

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

అగనంపూడి, ఫిబ్రవరి 7: కేన్సర్‌తో బాధ పడుతున్న నిరుపేద చోడవరపు గణేశ్‌ను ఆర్థికంగా ఆదుకునేందుకు దాతలు ముందుకు వచ్చారు. సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామఅప్పారావు పిలుపు మేరకు దాతల నుంచి సేకరించిన రూ.25 వేల నగదును బుధవారం పాత అగనంపూడిలో నివాసం ఉంటున్న బాధితునికి అందజేశారు. అలాగే ప్రభుత్వాస్పత్రి వైద్యుడు డాక్టర్ జగన్మోహన్‌రావు నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుదే సుశీల గజేంద్రరావు, ఎం.నరసింగరావు, ఈశ్వరరావు, శ్రీను, మస్తాన్‌రెడ్డి, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఏపీఐఐసీ చర్యలు



రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆటోనగర్, ఫిబ్రవరి 7: పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకు ఏపీఐఐసీ పలు చర్యలు చేపడుతోంది. శ్రీనగర్ జంక్షన్ నుంచి రాజధాని కాటా మీదుగా వెళ్లే రహదారి నిత్యం భారీ వాహనాలతో రద్దీగా మారుతోంది. దీంతో వాహన చోదకులు అనేక ఇబ్బందులను ఎదుర్కొనడమే కాకుండా స్వల్ప ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఏపీఐఐసీ, ఐలా అధికారులు రూ.కోటీ నాలుగు లక్షలతో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఐలా కమిషనర్ కె.జయచంద్ర ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రహదారి మధ్యలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఏపీఐఐసీ అధికారులు చేపడుతున్న చర్యలపై పలువురు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాత పెన్షన్‌పై హామీని మేనిఫెస్టోల్లో చేర్చాలి



పోస్టు కార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

పెందుర్తి, ఫిబ్రవరి 7: రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో పాతపెన్షన్‌పై హామీ చేర్చాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పోస్ట్‌కార్డుల క్యాంపెయిన్ నిర్వహించారు. బుధవారం ఉపాధ్యాయులు చినముషిడివాడ శాంతిగనగర్ పాఠశాల వద్ద పోస్టు కార్డులను ప్రదర్శించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణపై ఉంటుందని హామీ ఇచ్చిన రాజకీయ పార్టీకి మద్దతు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గ ప్రతినిధులు సీతామహాలక్ష్మి, శోభారాణి, పద్మావతి పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం, ఫిబ్రవరి 7: రమాబాయి అంబేడ్కర్ జీవితం మహిళలకు ఆదర్శనీయమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ జిల్లా అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం రమాబాయి అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. రమాబాయి అంబేడ్కర్ 1898 పిబ్రవరి 7న జన్మించారని తెలిపారు. ఆమెకు ఎనిమిదేళ్ల వయసులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను వివాహం చేసుకున్నారని తెలిపారు. దళిత ఉద్యమంపై దృష్టిసారించిన ఆమె తన బిడ్డలని త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారి అనసూయదేవి. గ్రంథాలయ అధికారి శిరీష, అధ్యాపకులు శాంతి, లక్ష్మీదేవి, సలోమీ తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో కుక్కల స్వైరవిహారం



గుంపులుగా కుక్కలు

పెందుర్తి, ఫిబ్రవరి 7: మండలంలోని సరిపల్లిలో కుక్కల స్వైరవిహారంతో స్థానికులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. కుక్కల నియంత్రణకు పంచాయతీ సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టడంలేదు. దీంతో పగలు రాత్రుళ్లు గుంపుగుంపులుగా తిరుగుతున్నాయి. పంచాయతీ కార్యాలయం నుంచి రామాలయం వరకు మార్గంలో పాదచారులు, వాహనదారులపై దాడి చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులను వెంబడిస్తున్నాయి. చిన్నారులపై దాడి చేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కేవీ విద్యార్థినికి అభినందన



ప్రణవిను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంచరపాలెం, ఫిబ్రవరి 7 : భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏపీ ప్రభుత్వం ప్రదర్శించిన అభివృద్ధి శకటంలో పాల్గొన్న 104 కేంద్రీయ విద్యాలయం-2 విద్యార్థిని ఎం. ప్రణవికి అభినందన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాసులు, హెచ్ఎం రామశాస్త్రి చిన్నారి ప్రణవిను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రకాశ్, శివ కుమార్, వినోద్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత సుబ్బరాజు ఆదర్శనీయులు



సుబ్బరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

అల్లిపురం, ఫిబ్రవరి 7: నిజాయితీ, నిబద్ధతతో సీపీఐ సీనియర్ నాయకుడు, జాతీయ బ్యాంకుల యూనియన్ పూర్వ నేత కాకర్లపూడి సుబ్బరాజు జీవిత ప్రయాణం సాగించారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. ఇటీవల మృతిచెందిన సుబ్బరాజు సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈకార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ సిద్ధాంతా లకు కట్టుబడి సుబ్బరాజు పనిచేసేవారని, ఆయనకు నేటితరం యువ కమ్యూనిస్టులు కార్యకర్తలు, నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, కె.సత్యంజనేయ, ఎస్.కె. రెహమాన్, క్షేత్రపాల్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆవర్తన పట్టిక దినోత్సవం



బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 7: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఆవర్తన పట్టిక దినోత్సవం బుధవారం నిర్వహించారు. కళాశాల విద్యార్థినులకు క్విజ్ పోటీలు ఏర్పాటుచేసి విజేతలకు ప్రిన్సిపాల్ డా.ఎస్.శోభారాణి బహుతులను ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అరుణపద్మ, బి.కల్యాణరాముడు, సంతోషి, అనూష, విద్యాకల్పన, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో లింగేశ్వరరావుకు స్వర్ణం



అవార్డుతో లింగేశ్వరరావు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 7: అఖిల భారత్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బీవీఎస్‌కే లింగేశ్వరరావు స్వర్ణ పతకం సాధించారు. ఇటీవల మొహాలిలో జరిగిన ఈ టోర్నీ పురుషుల 55 ప్లస్ డబుల్స్ ఫైనల్స్‌లో చెన్నైకు చెందిన డాక్టర్ మారన్ తంగవేలుతో కలిసి అద్భుతంగా రాణించి ఈ పతకం కైవసం చేసుకున్నారు. లింగేశ్వరరావు విజయంపై పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం

- రూ. 3 కోట్లతో 55వ వార్డులో కాలువలు, రోడ్ల నిర్మాణం
- కొరవడిన పర్యవేక్షణ..
- కాంట్రాక్టర్ ఇష్టారీతిగా పనులు

కంచరపాలెం, ఫిబ్రవరి 7 : అధికారుల పర్యవేక్షణ లోపంతో జీవీఎంసీ 55వార్డులో అభివృద్ధి పనులు నాణ్యతా లోపంతో సాగుతున్నాయి. వార్డు పరిధి రెడ్డి కంచరపాలెం, కొత్త వాడవీధి, జాషువానగర్, గంగన్న నగర్, ధర్మానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మాణ పనులను సుమారు రూ.3 కోట్ల నిధులతో ప్రారంభించారు. రెడ్డికంచరపాలెంలో రూ.18.5 లక్షలతో కాలువ నిర్మాణం, ధర్మానగర్‌లో రెండు కాలువలకు రూ.31 లక్షలు, తిక్కవానిపాలెంలో రోడ్ల నిర్మాణం కోసం రూ.36 లక్షలు, మరో రూ.13 లక్షలతో కాలువ నిర్మాణం, ధర్మానగర్‌లో రెండు సామాజిక భవనాల కోసం రూ. 38 లక్షలు కేటాయించారు. కోట్లాది రూపాయాల ప్రజాధనంతో చేపడుతున్న ఈ పనుల నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి తనిఖీ చేయాల్సి ఉంది. అయితే ఈ పనులకు అధికారులు శంకుస్థాపన జరిగిన తరువాత ఎక్కడా కనిపించకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పనుల నాణ్యతపై థర్డ్ పార్టీ సిబ్బంది తూతూ మంత్రంగా తనిఖీ చేసి తప్పుడునివేదికలు అందిస్తుండడంపై ప్రజలనుంచి ఆగ్రహం వ్యక్తం మవుతోంది. రోడ్లు, కాలువల్లో ఎక్కడికక్కడ డొల్లతనం కనిపిస్తున్నప్పటికీ అడిగేవారు లేక గుత్తేదారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు దృష్టిని సారించిపరిశీలించి పక్కాగా ని ర్మాణాలుజరిగేటట్టుచూడాలని స్థానికులు కోరుతున్నారు.



రెడ్డికంచరపాలెంలో నిర్మిస్తున్న కాలువ

'వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'



సంఘీభావం తెలుపుతున్న వెలమ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, మార్చి 7 : ఉత్తరాంధ్రలో వెలమ సామాజిక వర్గానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు సరైన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు చుక్క చినబాబు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర పరిధిలో 13 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ స్థానాల్లో తమ సామాజిక వర్గానికి టికెట్లు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో 32 లక్షలు జనాభా కలిగిన తమకు టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ , కాంగ్రెస్ తదితర అన్ని రాజకీయ ప్రధాన పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విశాఖలో 10 లక్షల మంది ఉన్నారన్నారు. విశాఖలోవెలమ సామాజిక భవనానికి సంబంధించిన జీవో జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు ఎర్ర సన్యాసినాయుడు, పాశల సూర్యనారాయణ, అనకాపల్లి అధ్యక్షులు కుంద్రపు సోమేశ్వరరావు, సిరికి పోతురాజు, మూడేడ్ల తమ్మునాయుడు, సిరికి కొండలరావు, జి.వెంకట రమేష్, పోలా ప్రసాద్, రంధి పరదేశినాయుడు, చొక్కాకుల రామకృష్ణ, తమటపు కృష్ణమూర్తి నాయుడు, మిడతాన వెంకటరమణమూర్తి, పరవాడ రమణ పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక వసతుల కల్పన: మేయర్



47వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

కంచరపాలెం, ఫిబ్రవరి 7 : జీవిఎంసీ 47వ వార్డు పరిధి కొండవాలు గ్రామాలైన సంజీవయ్య కాలనీ, జగజ్జీవన్ నగర్, రాంజీ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఉత్తర వైసీపీ నాయకుడు కేకే రాజు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో సామాజిక భవనాలకు మరమ్మతులు, రోడ్లు,కాలువల నిర్మాణం కోసం రూ.88.45లక్షల నిధులను కేటాయించినట్టు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. వార్డుల్లో మౌలిక వసతులతోపాటు అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, వసంతల అప్పారావు, గురువాజీ, కృపతో పాటు డీఈ భరణి, ఏఈ చాణక్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో రాత పరీక్షలు

కంచరపాలెం, ఫిబ్రవరి 7 : టెక్సాస్ ఇన్సుమెంట్ కంపెనీలో ఉద్యోగాల కోసం బుధవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు రాత పరీక్షలను నిర్వహించారు. ప్రాంగణ ఎంపికల్లో భాగంగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు చెందిన 103 మంది ఈ రాత పరీక్షలో పాల్గొన్నారు. ఈ పరీక్షలో ఎంపికైన వారికి ఈనెల 13న మౌఖిక పరీక్ష జరగనున్నది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఆరు నెలలు పాటు ఇంటర్న్‌షిప్ ట్రైనింగ్ ఉంటుంది. ఈ కాలంలో నెలకు రూ.25వేలు స్టైఫండ్ చెల్లించనున్నారు. అనంతరం వార్షికవేతనం రూ.8.6 లక్షలు ప్యాకేజీ లభిస్తుంచనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు పేర్కొన్నారు.రాత పరీలో ఎలక్ట్రికల్ విభాగాధిపతి కేడీవీ నరసింహారావు, అధ్యాపకులు జ్ఞానప్రసూన, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

అల్లిపురం, ఫిబ్రవరి 7: జీవీఎంసీ 32వ వార్డులో జనసేన నాయకులు కందుల నాగరాజు ఆధ్వర్యంలో నేరెళ్ల కోనేరు వద్ద పేదలకు నిత్యావసర సరసరుకులు పంపిణీ చేశారు. అనంతరం పలు వార్డుల్లో పర్యటించి మహిళలకు చీరలు, తాళిబొట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి జగన్ అన్నీ అసత్యాలు చెబుతున్నారని, వీటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విశాఖలోని స్థిరాస్తులపై అప్పు ఎవరు తీరుస్తారు?

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, చోడవరం ఇన్‌చార్జి మూర్తియాదవ్



మాట్లాడుతున్న మూర్తి యాదవ్

మహారాణిపేట, ఫిబవరి 7: విశాఖ నగరంలో స్థిరాస్తులపై రూ. 25 వేల కోట్లు అప్పులు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి.. వీటికి సంబంధించి కనీసం వడ్డీలు సైతం చెల్లించటం లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, చోడవరం ఇన్‌చార్జి వీఎస్ఎన్ మూర్తి యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో రెండు నెలల్లో జరిగే ఎన్నికల అనంతరం జగన్ ఇంటికివెళ్లిపోతారని, అప్పుడు విశాఖలో ప్రజల ఆస్తులపై తీసుకువచ్చిన అప్పులను ఎవరు తీరుస్తారని ప్ర శ్నించారు, జగన్ రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి అన్ని విధాలా సర్వనాశనం చేశారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖను నిలువుగా దోచుకున్నారని ఆరోపించారు. జీవీఎంసీ పరిధిలో బీపీఎస్ కోసం వసూలు చేసిన డబ్బు ఏం చేశారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. విశాఖ నగరంలో రూ. 50 వేల కోట్ల ఆస్తులను తారుమారు చేసి జగన్ కుటుంబం దోచుకుందన్నారు. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించే రోజులు సమీపించాయని ఆయన హెచ్చరించారు.

ఫైనల్స్‌కు చేరిన టెన్నిస్ టోర్నమెంట్



పోటీపడుతున్న క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: సీఎంఆర్ అయిష్ట టెన్నిస్ టోర్నమెంట్ 17వ సీఎంఆర్ ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతోంది. బుధవారం అన్ని విభాగాల్లోని డబుల్ ,సింగిల్స్ మ్యాచ్‌లు ఫైనల్స్‌కు వచ్చాయి. అయిష్ట నుంచి సెక్రటరీ డీఎస్ఎన్ రాజు, రాధాకృష్ణమూర్తి 70 ప్లస్ డబుల్ విభాగంలో ఫైనల్ గెలుపొందారు. 65ప్లస్ సింగిల్స్‌లో సుదర్శన్ గెలుపొందారు. 70 ప్లస్ విభాగంలో సేతు గెలుపొందారు. మిగతా విభాగంలో జరగాల్సిన ఫైనల్ మ్యాచ్‌లు గురువారం ఆఫీసర్ క్లబ్‌లో జరుగనున్నాయి. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు.ఈ కార్యక్రమానికి మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు పాల్గొననున్నట్టు అయిష్ట అధ్యక్షులు ప్రేమచంద్ తెలిపారు.

విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు



విద్యార్థులకు పరీక్షిస్తున్న వైద్యులు

సీతమ్మధార, ఫిబ్రవరి 7: సీతమ్మధార వీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్, జూనియర్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పట్నం, కృషి వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.మూడు రోజుల పాటు 1200 మంది విద్యార్థులకు వైద్య సేవలందించనున్నట్టు ప్రధానోపాధ్యాయులు రామ్‌ప్రసాద్ తెలిపారు. కార్డియాలిజిస్ట్ డాక్టర్ పీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ అమృత వైద్య పరీక్షలు చేస్తున్నట్టు వివరించారు.

అప్పులతో కౌలు రైతు ఆత్మహత్య



అప్పలరాజు (ఫైల్ ఫొటో)

పద్మనాభం, ఫిబ్రవరి 7: విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో అప్పులు తీర్చలేక కౌలు రైతు ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం..గ్రామానికి చెందిన పి.అప్పలరాజు (41) స్థానికంగా రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి తోట వేసి, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతినడంతో అనుకున్న దిగుబడి లేక నష్టాలు వచ్చాయి. దీంతో చేసిన అప్పులు తీర్చలేక దిగులుతో ఈనెల ఐదో తేదీన పొలంలోనే పురుగుల మందు తాగారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం అప్పలరాజు మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్ శ్రీధర్ కేసు నమోదు చేశారు.

రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ, ఫిబ్రవరి 7: విశాఖపట్నం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గుడే పోతన్న (45) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్టు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం...అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బద్దంబూరు గ్రామానికి చెందిన పోతన్న గత ఏడాది జూలైలో గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడికి పాడేరు కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు సెంట్రల్ జైలుకు తరలించారు. జైలుకు వచ్చిన సమయంలోనే అనారోగ్యంగా ఉన్నాడు. మంగళవారం ఉదయం అస్వస్థతకు గురవ్వడంతో జైలు వైద్యులు పరీక్షలు జరిపి, అతనికి గుండె సంబంధిత సమస్య ఉన్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. కాగా జైలు అధికారులు కొట్టడం వల్లే పోతన్న చనిపోయినట్టు అతని కుటుంబీకులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

బొగ్గన వారి బొంకులు

... 5వ పేజీ తరువాయి

భీమిలిలో జెట్టీ నిర్మిస్తామని ప్రకటించి శంకుస్థాపన మాత్రం చేశారు. అయితే దానికి ఇప్పటివరకూ భూసేకరణ పూర్తి కాలేదు. వాస్తవం ఇలా ఉండగా...కోట్ల రూపాయలతో ఏదో చేసేశామని బల్లలు చరిచారు.

విశాఖ విమానాశ్రయం వారి ఖాతాలోనే

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. వాస్తవానికి విమానాశ్రయానికి చంద్రబాబునాయుడు హయాంలోనే శంకుస్థాపన జరిగింది. నాలుగేళ్లు దానిని పట్టించుకోకుండా వదిలేసి తొమ్మిది నెలల క్రితం దానికి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ పనులు ఇటీవలె మొదలయ్యాయి. అదలా ఉంచితే..విశాఖ విమానాశ్రయాన్ని కూడా తామే అభివృద్ధి చేశామని బుగ్గన ప్రకటించారు. ఇక్కడి విమానాశ్రయం నేవీ ఆధ్వర్యంలో ఉండగా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా నిధులతో అభివృద్ధి చేశారు. విమానాశ్రయం బయట బస్టాపు నిర్మించి, అక్కడ సీఎంకి స్వాగతం అంటూ పెద్ద హోర్డింగ్ పెట్టుకొని...విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశామని చెప్పుకొంటున్నారు.

డబ్ల్యుఎన్ఎస్, పల్సస్ కొత్త కంపెనీలట

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక 65 కొత్త ఐటీ కంపెనీలు ఏర్పాటయ్యాయని, వాటి ద్వారా 47,908 మందికి ఉద్యోగాలు వచ్చాయని మంత్రి ప్రకటించారు. విశాఖలో అదానీ డేటా సెంటర్, డబ్ల్యుఎన్ఎస్, పల్సస్, రాన్‌స్టాండ్, ఇన్ఫోసిస్ సంస్థలు ఏర్పాటయ్యాయని వివరించారు. అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు చంద్రబాబునాయుడు హయాంలోనే ఒప్పందం జరిగింది. ఆయన శంకుస్థాపన కూడా చేశారు. అయితే సీఎం జగన్ గత మే నెలలో దానికి మరోమారు శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ అక్కడ పనులు మొదలు కాలేదు. ఏ సెంటరూ రాలేదు. ఇక డబ్ల్యుఎన్ఎస్, పల్సస్ సంస్థలు చాలా పాతవి. అవి తెలుగుదేశం ప్రభుత్వం నుంచే విశాఖలో ఉన్నాయి. కొత్తవి కానే కావు. ఇన్ఫోసిస్ సంస్థ వారి ఉద్యోగుల కోసం విశాఖలో ఓ సెంటర్ ఏర్పాటు చేసుకుంది. వారికి కనీసం భవనం గానీ, భూమి గానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. కానీ తామే దానిని తీసుకువచ్చినట్టు ఐటీ మంత్రి సహా అంతా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఐటీ సంస్థలకు ఉద్యోగులను సమకూర్చే రాన్‌స్టాండ్ మాత్రమే వీరి హయాంలో వచ్చింది. ఉత్తరాంధ్రాలో మానవ వనరులు అధికంగా ఉండడం వల్ల వారు వచ్చారు. ఈ ప్రభుత్వంవారికి కూడా ఇచ్చిందేమీ లేదు.

రుషికొండలో బ్లూ ఫ్లాగ్ ఎగరేశారట!!

రుషికొండ బీచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం చొరవ వల్ల బ్లూ ఫ్లాగ్ హోదా వచ్చిందని మంత్రి బుగ్గన చెప్పుకొచ్చారు. రుషికొండ బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వగా, వాటితో దానిని అభివృద్ధి చేశారు. అందుకే దానికి బ్లూ ఫ్లాగ్ హోదా వచ్చింది. ఆ పేరును చెడగొడుతూ రుషికొండకు బోడిగుండు కొట్టించి అక్కడ పర్యాటక శాఖ రిసార్ట్ అంటూరూ.450 కోట్లతో సీఎంక్యాంపు కార్యాలయాలు కట్టించుకున్నారు.

మహా మాయ

... 5వ పేజీ తరువాయి

మూడు రోజులు మాత్రం కొంతమేర వాహనాలు, జేసీబీలతో చెత్తకుప్పలను తొలగించారు. అయితే సమ్మె కాలంలో తాత్కాలిక కూలీలు, జేసీబీలు, టిప్పర్లను ఏర్పాటు చేశామని, అందుకోసం రూ.3.2 కోట్లు ఖర్చు అయిందంటూ ప్రజారోగ్య విభాగం అధికారులు బిల్లు తయారుచేశారు. ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్లకు చెల్లించాలంటూ పలు కేటగిరీల కింద ప్రతిపాదనలు తయారుచేసి స్టాండింగ్ కమిటీ ఆమోదానికి పెట్టగా సభ్యులు ఒక్కరు కూడా అభ్యంతరం వ్యక్తంచేయకుండా ఆమోదించేసింది. అలాగే మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకూ బీఆర్‌టీఎస్ రోడ్డుపై బీటీ హాట్‌మిక్స్ వేసేందుకు సుమారు రూ.రెండు కోట్లను ఖర్చు చేసేందుకు కమిటీ ఆమోదించింది. అలాగే బీచ్‌రోడ్డులోని మారిటైమ్ మ్యూజియం మరమ్మతులకు రూ.50 లక్షలు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి వివిధ వార్డుల్లో రూ.21.63 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

దర్యాప్తు ముగిసినట్టేనా!?

... 5వ పేజీ తరువాయి

రమణయ్యను ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందనేది విచారణలో గంగారావు కచ్చితంగా చెప్పి ఉంటాడు. ఒకవేళ చెప్పకపోతే పోలీసులు తమదైన శైలిలో సమాధానం రాబడతారు. అయితే ఆ వివరాలను పోలీసులు బయటపెట్టడం లేదు. పైగా ఇంకా విచారించాల్సి ఉంటే తూతూమంత్రంగా కస్టడీ పిటిషన్ వేసి వదిలేయకుండా, ఉన్నతాధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకునేవారని, ఈ కేసుల్లో ఇంతవరకూ అలాంటి పరిస్థితి కనిపించలేదని అభిప్రాయపడుతున్నారు. గంగారావును అరెస్టు చేయడంతో ఈ కేసు దర్యాప్తును పోలీసులు ముగించేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని పేర్కొంటున్నారు. ఈ కేసులో దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడించడానికి పోలీసులు ఆసక్తి చూపకపోవడం అనేక అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది.

నగరంలో నాకాబందీ

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయని, జీఆర్‌టీ, ఖజానా తదితర షాపులకు సంబంధించినవిగా భావిస్తున్నట్టు పోలీస్ అధికారులు వెల్లడించారు. వారు జీఎస్టీ సక్రమంగా కట్టారా?, లేదా?, ఆ పత్రాలకు, వారు చూపుతున్న సరకుకు వివరాలు సరిపోయాయా?, లేదా?...అన్న విషయాలు పరిశీలిస్తున్నారు. అదేవిధంగా రైల్వేస్టేషన్ సమీపంలో రూ.4.5 లక్షలు నగదు, ఆరు మద్యం సీసాలు, మద్దిలపాలెం జంక్షన్‌లో రూ.4.29 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధి భగత్‌సింగ్‌నగర్ వద్ద ఆటోలో 860 కిలోల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. ఇక సెబ్ అధికారులు నిర్వహించే రోజువారీ తనిఖీల్లో భాగంగా ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనదారుడి వద్ద రూ.5.97 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. నగరంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలను జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ-1 మణికంఠ చందోలు, జోన్-2 డీసీపీ ఎం.సత్యనారాయణ పర్యవేక్షించారు.

రెవెన్యూ సిబ్బందికి రక్షణ కల్పిస్తాం

... 5వ పేజీ తరువాయి

వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామన్నారు. రూరల్ తహసీల్దారుగా పనిచేసిన సనపల రమణయ్య బదిలీ అక్కడ నుంచి అయిన రెండు రోజులకే హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యం లోనే కలెక్టర్ బుధవారం రూరల్ తహసీల్దారు కార్యా లయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు. హత్య పూర్వాపరాలను సిబ్బంది నుంచి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో అప్పుడప్పుడు క్లిష్టమైన పరిస్థితులు ఎదురవుతాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. కార్యాలయ పనుల నిమిత్తం ఎవరినీ ఇంటికి ఆహ్వానించవద్దని హితవు పలికారు. వీఆర్వోలు ఒకచోట కూర్చొని విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యాలయాన్ని ఆధునికీకరించే పనులు త్వరలో చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి ఉన్నారు.

నిద్దరోతున్న నిఘా వ్యవస్థ

... 5వ పేజీ తరువాయి

అందజేస్తుంటారు. వీటిని బట్టి పోలీస్ అధికారులు కార్యాచరణ రూపొందించి అమలుచేస్తారు. ఒకవేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిణామాలు జరిగే అవకాశం ఉందనో...ప్రజాధనం దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందనో...ప్రజల ప్రాణాలు, జీవనానికి ఇబ్బంది తలెత్తే అవకాశం ఉందనో తెలిస్తే ముందస్తు చర్యలు తీసుకుంటారు. అందువల్లనే స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పోస్టింగ్‌లు ఇచ్చేముందు ఆయా సిబ్బంది గతచరిత్ర, పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు, కేసులు లేవని తేలడంతోపాటు విధినిర్వహణలో నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరిస్తారనే నమ్మకం కుదిరితేనే ఉన్నతాధికారులు వారికి పోస్టింగ్ ఇస్తారు. అయితే కాలక్రమేణా ఆ రెండు విభాగాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సమాచార సేకరణపై నిర్లక్ష్యం

స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేస్తున్న వారిలో కొంత మందిని మినహాయిస్తే మిగిలిన వారంతా మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శాఖాపరమైన చర్యలకు గురైన వారు, అవినీతి కేసుల్లో ఉన్నవారు సైతం ఆ విభాగాల్లో పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. పోలీస్ స్టేషన్లలో ఏళ్ల తరబడి పనిచేసిన వారిపై అనేక రకాల అభియోగాలు ఉంటాయి. ఇటువంటి వారంతా ఇంకా స్టేషన్లలో పనిచేస్తే ఉన్నతాధికారుల నుంచి ఇబ్బందులు, వేధింపులు తప్పవనే ఉద్దేశంతోనే, తమ ఆస్తులపై ఏసీబీ ఏక్షణంలోనైనా దాడులు చేసే ప్రమాదం ఉందనో ముందుజాగ్రత్తగా నాన్‌ఫోకల్‌లోకి వెళ్లిపోవాలని యత్నిస్తుంటారు. అలాంటివారంతా స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాల్లోకి వెళ్లిపోయేందుకు ఆసక్తి చూపుతారు. తమలాంటివారికి ఆయా విభాగాల్లో పోస్టింగ్‌లు దక్కవని తెలిసినప్పటికీ, తమకు పరిచయస్తులు, సన్నిహితులుగా ఉండే ఆయా విభాగాల్లోని ఉన్నతాధికారుల సిఫారసుతో పోస్టింగ్ సాధించుకుంటున్నారు.

పోస్టింగ్ వచ్చిన తర్వాత తమకు కేటాయించిన ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యవహారాలు, రౌడీషీటర్లు, రాజకీయనేతల కదలికలు, పోలీస్, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిపోయేవారి సాధక బాధకాలు, అధికారులు, సిబ్బంది వారితో వ్యవహరించేతీరు, అవినీతి వంటి అంశాలపై దృష్టి పెట్టి సమాచారం సేకరించడానికి మాత్రం ఇష్టపడడం లేదు. తమ పరిధిలో జరిగే విలేకరుల సమావేశాలు, ధర్నాలకు హాజరై విలేకరుల మాదిరిగా కూర్చొని సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు పంపించి తమ పని అయిపోయిందన్నట్టు భావిస్తున్నారు. అలాగే అక్కడ కనిపించే విలేకరులను ఇతర విషయాల గురించి అడిగి వారిచ్చే సమాచారం ఎంతవరకు సరైనదో నిర్ధారించుకోకుండానే దానిని తాము సేకరించినట్టు ఉన్నతాధికారులకు చెప్పేస్తున్నారు.

దీనివల్ల నగరంలో జరిగే భూకబ్జాలు, రౌడీషీటర్ల ఆగడాలు, గంజాయి, మత్తుమందుల రవాణా వంటి సమాచారం తమకు చేరడం లేదని పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

ఉత్తరాంధ్ర ఆత్మగౌరవ యాత్ర



మాట్లాడుతున్న ఉత్తరాంధ్రపార్టీ అధ్యక్షుడు రామారావు

అక్కయ్యపాలెం, ఫిబవరి 7: ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్రం సాధించాలనే లక్ష్యం తో ఈనెల 29 వతేదీనుంచి 23 రోజుల పాటు ఆత్మగౌరవ యాత్ర నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మెట్టరామారావు తెలిపారు. ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవం నిలపడం కోసం గళం విప్పాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ 53స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. తమ పార్టీ అభ్యర్థుల గెలుపు ద్వారా ప్రత్యేక రాష్ట్ర హోదాను సాధించుకోగలమని అన్నారు.ఈ ఆత్మగౌరవ యాత్ర అక్కయ్యపాలెం పార్టీ ఆఫీసు నుంచి ప్రారంభమై స్టీల్‌ప్లాంట్ శిబిరం వద్ద సంఘీభావం తెలిపి తుని, కాకినాడ, అమలాపురం మీదుగా దవళేశ్వరం చేరుకుని గోదావరి జలాలను సేకరించి వాటితో ఉత్తరాంధ్ర అంతా యాత్ర సాగుతుందన్నారు.

చరిత్రకు ప్రతీక మూడుదారులు పుస్తకం

సీతంపేట, ఫిబ్రవరి 7: ముగ్గురు ముఖ్యమంత్రుల పాలన చరిత్రకు ప్రతీకగా మూడు దారులు పుస్తకం నిలుస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ రచించిన మూడు దారులు పుస్తక పరిచయ సభను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఏయూ జర్నలిజం శాఖ విశ్రాంత ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ పి.బాబివర్ధన్, పాత్రికేయ ప్రముఖులు మంగు రాజగోపాల్, పాత్రికేయులు బీఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కయ్యపాలెం, ఫిబవరి 7: గ్రేటర్ 44వ వార్డు అబీద్ నగర్‌లో రూ.38.44 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మన్ కేకే రాజు .. ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్‌తో కలసి శంకుస్థాపనచేశారు. అనంతరం ధాన్ ఫౌండేషన్ భవనం, పునర్మించిన జిమ్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. నాయకులు హబీబు, మహాదాస్ గోపి, పి. గోపి, సీతారాం. జి.వెంకటరావు, బషీర్, ప్రకాష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చినగదిలి తహసీల్దార్‌గా శివన్నారాయణ



ఆరిలోవ, ఫిబ్రవరి 7 : చినగదిలి తహసీల్దార్‌గా ఎస్. శివన్నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు.గతంలో విజయనగరం జిల్లా గరివిడిలోనూ పనిచేశారు. ఇటీవల ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లి హత్యకు గురైన రమణయ్య స్థానంలో ఆయన నియామితులయ్యారు. కాగా ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీటీ కూడా వేరేచోటకు బదిలీకి ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

10న నేత్ర వైద్య శిబిరం

భీమునిపట్నం, ఫిబ్రవరి 7 : పట్టణంలోని కీటిన్‌పేట ది సన్ స్కూల్ ఆవరణలో ఈనెల 10వ తేదీన నీడీ వెల్ఫేర్, ఓఎస్‌జీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిబిరాలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 85002 64289, 90007 28120 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కొమ్మాది, ఫిబ్రవరి 7 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శ్రీచైతన్య పాఠశాలల రీజనల్ ఇన్‌చార్జి అహ్మద్ ఆలీ సూచించారు. బుధవారం బక్కన్నపాలెం రోడ్డులోని ఆపాఠశాలలో నిర్వహించిన క్రీడా మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి చేయలేకే విమర్శలు'

కొమ్మాది, ఫిబ్రవరి 7 : జీవీఎంసీ ఆరో వార్డులో ఏం అభివృద్ధి చేశారో వైసీపీ నాయకులు చెప్పాలని ఆ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు సంతోష్‌నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వార్డులో తమ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సందీప్ నిర్వహించిన పాదయాత్రలో లేవనెత్తిన అంశాలకు జవాబు చెప్పలేక వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. సందీప్ పాదయాత్రలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కూడా వేయలేదని చెబుతున్న వైసీపీ నేతలు అంబేడ్కర్ విద్యాదీవెన పథకాన్ని వైఎస్సార్ విద్యా దీవెనగా మార్చినప్పుడు ఏం మాట్లాడలేదని ప్రశ్నించారు. కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక తాను ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. వార్డులో వీధి లైట్లు వెలగక అంధకారం నెలకొందని చెప్పారు. వైసీపీ నాయకులు ముందు ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని సూచించారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు



కళాకారుల వీణావాయిద్య కచేరి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 7 : ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో జరుగుతున్న వెంకన్న వైభవోత్సవాల్లో భాగంగా బుధవారం విష్ణుసహస్రనామ పారాయణం, విజయశ్రీ బృందం సంగీత కచేరి, వయలిన్, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను అలరించాయి. శ్రీవల్లభ వేంకటేశ్వరస్వామి ఆధ్యాత్మిక పీఠం, కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. గురువారం ఉదయం 7.30 నుంచి సుప్రభాత సేవతో ప్రత్యేక పూజలు మొదలై, లక్ష తులసీదళార్చన, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, ఏకాంత సేవ వంటి కార్యక్రమాలు జరగనున్నట్టు నిర్వాహకుడు హిమాంశు ప్రసాద్ తెలిపారు.

సినిమా గైడ్

● **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
● **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
● **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
● **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
● **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
● **నా సామిరంగ :** శ్రీకన్య లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
● **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19,టమాటా 32, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 50, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 18, క్యారెట్ 24, దొండకాయలు 36, బంగాళదుంపలు 22, అరటికాయ (పె)4, మునక్కాడలు (కిలో) 86, అల్లం (పాతది) 110, బరబటి 30, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 330, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 40, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28 , కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	108
ఫారం ధర	--	128
విత్ స్కిన్	--	216
స్కిన్‌లెస్	--	236

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

రోడ్డు నిర్మాణం హామీ ఏమైంది..?

- అధ్వానంగా అడివివరం హైస్కూల్ రహదారి
- సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన
- రెండు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడి
- ఏడాది కావస్తున్నా.. ప్రారంభంకాని వైనం
- రాకపోకలకు విద్యార్థుల అవస్థలు



రాళ్లు తేలి ఉన్న రోడ్డు

సింహాచలం, ఫిబ్రవరి 7 : జీవీఎంసీ 98వ వార్డు అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పక్కా రోడ్డు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిలో అర కిలోమీటరు పూర్తిగా రాళ్లు తేలి ఉండడంతో రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఏడాది క్రితం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు.కానీ ఇప్పటికి ఏడాది కావస్తున్నా.. కనీసం నిర్మాణ సామగ్రి తరలించలేదు సరికదా పనుల ప్రారంభోత్సవానికి ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. దీంతో వర్షం పడితే రోడ్డులో విద్యార్థులు రాకపోకలు చేయలేక పోతున్నారు. కాగా పాఠశాల నిర్మాణానికి దేవస్థానం నాలుగు ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని ఉదారంగా ఇచ్చింది. ఇప్పుడు స్కూల్‌కు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిని కలుపుతూ నిర్మించదలచిన అప్రోచ్ రోడ్డుకు అభ్యంతరం చెబుతుండడం వల్లే నిర్మాణంలో జాప్యం జరుగుతోందని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. రోడ్డు నిర్మాణానికి అనుమతులు కోరుతూ దేవస్థానం ఈఓకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశామని, దానికి సమాధానం లభించలేదని వారు అంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి పనుల ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

వచ్చే నెల 20 నుంచి అనంతుని కల్యాణోత్సవాలు



సమావేశమైన ఉత్సవ కమిటీ సభ్యులు

పద్మనాభం, ఫిబ్రవరి 7 : పద్మనాభంలోని అనంత పద్మనాభుని కల్యాణోత్సవాలు మార్చి 20 నుంచి నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈమేరకు బుధవారం వారు కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సీతారామాంజనేయ స్వామి మాట్లాడుతూ ఈఏడాది మార్చి 20 నుంచి 26వరకు అనంతుని కల్యాణోత్సవాలు నిర్వహించడానికి సంకల్పించామన్నారు. 21న స్వామివారి కల్యాణం, 23న తెప్పోత్సవం, 24న రథోత్సవం, 25న డోలోత్సవం, 26 పుష్పయాగం జరుగుతాయని తెలిపారు. దేవస్థానం ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఉత్స వాల నిర్వహణను కమిటీ తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీపీ కె. రాంబాబు స్పందిస్తూ దేవస్థానం కొన్ని బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఉత్సవం ఘనంగా నిర్వహించడానికి కమిటీపరంగా తాము చేయాల్సిన పనులు, బాధ్యతలు తీసుకుంటామని తెలిపారు. గత ఏడాది పునఃప్రారంభించిన స్వామివారి తెప్పోత్సవం బాధ్యతను కమిటీ తీసుకొని వైభవంగా నిర్వహిస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కూడా నిర్ణయించామన్నారు. ఈఓతో మరోసారి సమావేశం కావాలని సభ్యులు నిర్ణయించారు. ఈ సమావేశంలో భీమిలి ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు జీపీవై నాయుడు, శేరిఖండం సర్పంచ్ చిన్నారావు, కమిటీ సభ్యులు పద్దు, ఎర్నాయుడు, పైడిరాజు, నారాయణరావు, సత్యనారాయణ, అప్పలనాయుడు, నర్శింహనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన : డీఈఓ



నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈఓ చంద్రకళ

ఆరిలోవ, ఫిబ్రవరి 7 : ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని డీఈఓ ఎల్. చంద్రకళ సూచించారు. బుధవారం ఆమె ఆనందపురం మండలంలోని గిడిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతుల గదులకు వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే నోట్ పుస్తకాలు, ట్యాబ్స్ పరిశీలించారు. కొంతమంది పిల్లలు చదువులో వెనుకబడి ఉండడంతో వారికి తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గుడిగుండం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.

ఎస్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

పద్మనాభం, ఫిబ్రవరి 7 : పద్మనాభంలోని జిల్లా పరిషత్ అతిథి గృహం ఆవరణలో బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా కె. అక్కులు, అధ్యక్షుడిగా వి. గణేష్, ప్రధాన కార్యదర్శిగా టి. రామకృష్ణ, సహాధ్యక్షులుగా ప్రశాంతి, అదనపు ప్రధాన కార్యదర్శిగా రామునాయుడు, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, శ్రీనివాసరావు, కార్యదర్శులుగా వెంకటరాజు, ఆదిబాబు, నాగరాజు, కోశాధికారిగా బంగారురావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కౌన్సిలర్లుగా జగదీష్‌బాబు, శంకరరావు, రమేష్, సింహాచలం, రామస్వామి, కేటీఎస్ నాయుడు, ఆంజనేయులు, లక్ష్మణరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి హైస్కూల్ హెచ్ఎం సన్యాసిరావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 7 : భీమిలి, ఎస్. కోట నియోజకవర్గాల్లో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్టు బీజేపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. బుధవారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో పల్లెకు పోదాం పోస్టర్లను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి అనేక పథకాల ద్వారా నిధులిస్తుందని వాటిని నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరంగం ధనేశ్వరరావు, ఎస్‌వీఎస్ దిలీప్ వర్మ, జె. దామోదర్ యాదవ్, ఎస్ఏ రామోహన్, బండారు అనిల్‌కుమార్, ఎస్ఆర్ఎల్ఎన్ మురళీ మోహన్ రాజు, తెడ్లపు అప్పారావు, లెంకా శ్రీరామ్, కె. వసంత్ వర్మ పాల్గొన్నారు.

జడ్సీ రాముకు ఘనంగా వీడ్కోలు



రాము దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

భీమునిపట్నం,ఫిబ్రవరి 7 : జోనల్ కమిషనర్ రాముకు తూర్పు గోదావరి జిల్లా మండపేటకు బదిలీ కావడంతో జోనల్ కార్యాలయం సిబ్బంది బుధవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రస్తుత జడ్సీ శైలజ వల్లీ, పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ ధవళ శ్రీనివాసరావు, తదితరులు రాము దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. పెండింగ్‌లో వున్న పనులు ఏవిధంగా పూర్తి చేయాలన్న దానిపై సూచనలు చేశారు. అనంతరం జడ్సీ శైలజావల్లీని కూడా సిబ్బంది దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ సారిపల్లి శ్రీనివాసరావు, పబ్లిక్ వర్క్స్ ఏఈ సుమన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మ తల్లికి వేరుశనక్కాయలతో అలంకరణ



తగరపువలస, ఫిబ్రవరి 7 : సంతపేటలో ఉన్న కొత్తమ్మతల్లిని భక్తులు బుధవారం వేరు శనక్కాయలతో అలంకరించారు. తాతయ్యలు, రమణయ్య ఆర్థిక సహాయంతో ఈ అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

క్రీడా మైదానం పరిశీలన

ఆనందపురం ఫిబ్రవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు దబ్బంద సమీపంలో ఉన్న టిడ్కో కాలనీ క్రీడా మైదానాన్ని జేసీ మయూర అశోక్, డీసీఓ శ్రీనివాస్, ఆర్డీఓ భాస్కర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 1500 మంది క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు పరిశీలించి, ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మండల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్ కుమార్, ఆర్ఐ మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7 : త్యాగానికి ప్రతిరూపంగా రమాబాయి అంబేడ్కర్ నిలుస్తారని ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతి బుధవారం ఆ విభాగంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పలువురు రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా షారోన్ రాజు మాట్లాడుతూ రమాబాయి అంటే ఒక పోరాటం అన్నారు. అమెరికాలో అం బేడ్కర్ చదువుకుంటున్న సమయంలో తాను పస్తులుండి ప్రతి పైసా కూడబెట్టి ఆయనకు పంపించా రని చెప్పారు. అంబేడ్కర్ విజయంలో, ప్రగతిలో రమాబాయి కృషి నిరుపమానమన్నారు.

'వికసిత్ భారత్'లో ఏయూకి అవార్డు



పురుషోత్తంను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7 : ఇటీవల న్యూఢిల్లీలో అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ యూనివర్సిటీలకు నిర్వహించిన వికసిత్ భారత్ పోటీల్లో ఏయూకి ప్రతిష్టాత్మకమైన మేథో సంపత్తి (ఐపీ) ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈమేరకు ప్రొఫెసర్ హెచ్. పురుషోత్తం డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్ ఏయూ తరఫున ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి బుధవారం తన ఛాంబర్‌లో పురుషోత్తంను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్, ఇతర అధ్యాపకులు, సభ్యులు పాల్గొన్నారు.

'యాదవులకు వైసీపీ అన్యాయం'



విలేకరులతో మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

ఆరిలోవ, ఫిబ్రవరి 7 : తూర్పు నియోజకవర్గం టికెట్‌ను వైసీపీ అధిష్ఠానం యాదవులకు కేటాయించాలని తోటగరువు యాదవ సంఘం అధ్యక్షుడు ఒమ్మి చిన్నారావు డిమాండ్ చేశారు. ఇతరులకు టికెట్ ఇస్తే గెలుపునకు సహకరించమని చెప్పారు.బుధవారం ఆయన తోటగరువులోని సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 70 శాతం మంది యాదవులు ఉండగా ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. 15 ఏళ్ల నుంచి అన్ని రాజకీయ పార్టీలు తమకు అన్యాయం చేస్తున్నాయని, వైసీపీ తరఫున అక్కరమాని విజయనిర్మలకు టికెట్ ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు కొల్లి వెంకటరమణ, మొల్లి జగ్గారావు, మణ్యాల వెంకటరమణ, సర్వసిద్ధి వెంకటరమణ పాల్గొన్నారు.

16న స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 7 : ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు స్టీల్‌ప్లాంట్‌లో ఈనెల 16న కార్మిక సమ్మె చేయనున్నారు.ప్లాంట్‌లో 11 వేల మంది నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే మరో పదివేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ఉద్యోగులు, కార్మికుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను ఉక్కు యాజమాన్యం పరిష్కరించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేయడంతో పాటు ధర్నాలు, ఆందోళనలు చేశారు. ఈ క్రమంలో 16న సమ్మె చేస్తున్నట్టు నోటీసు కూడా అందజేశారు.



సందీప్‌కి సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు తథ్యం

- జనసేన భీమిలి అసెంబ్లీ ఇన్‌చార్జి సందీప్

ఎండాడ, ఫిబ్రవరి 7 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ అన్నారు. బుధవారం ఆయన ఎండాడలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండాడలో పేదలు 60 గజాలలో ఇల్లు కట్టుకుంటే ఇబ్బంది పెడుతున్న అధికారులు హాయగ్రీవ వంటి విల్లాలకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. భీమిలిలో ప్రభుత్వ భూములు దోచుకున్న వైసీపీ కావాలో ప్రజా ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. గెలిచినా ఓడినా ప్రజల కోసం పోరాటం చేసే పార్టీ జనసేన అని చెప్పారు. జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 6,7 వార్డుల అధ్యక్షులు సంతోష్, నాగోతి నరసింహనాయుడు, ఆర్.కృష్ణయ్య చంద్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.కాగా పాదయాత్రకు 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో నాయకులు పోలమాంబ గుడి ప్రాంతంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు వార్డులోని సమస్యలను సందీప్‌కు వివరించారు. కార్యక్రమంలో అక్కరబోయిన రాంబాబు, ఒమ్మి బాబురావు, సారిపిల్లి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, దొరబాబు, పరమేశ్వరరావు, మంగాదేవి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరాజు

భీమునిపట్నం, ఫిబ్రవరి 7 : పట్టణంలోని సెడార్ పాఠశాల విద్యార్థులకు చిట్టివలస అగ్నిమాపక దళ సిబ్బంది బుధవారం ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను ఎలా నివారించాలన్న దానిపై వివిధ యంత్రాల ద్వారా ప్రదర్శన ఇచ్చి, వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖాధికారి జి. శ్రీనివాసరాజు, సిబ్బంది చక్రవర్తి, జగన్నాథం, ఎస్. రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎన్ నవీన్‌కుమార్, ఏవో మంజుల పాల్గొన్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, ఫిబ్రవరి 7 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు వినతి

సింహాచలం, ఫిబ్రవరి 7 : జీవీఎంసీ 98వ వార్డు గోశాల సమీపంలోని సింహగిరి నిర్వాసితుల లేఅవుట్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పివి నరసింహం విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. లేఅవుట్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం వల్ల యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

500 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 7 : కొత్త వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 500 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం క్లోజ్ ది కేర్ గ్యాప్ అన్న థీమ్‌తో కేన్సర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కేన్సర్ చికిత్స విభాగం వైద్యురాలు, కేన్సర్ క్యూర్ ట్రస్టు ఫౌండర్ డాక్టర్ రామావత్ మాట్లాడుతూ కేన్సర్‌కు కారణాలు, నివారణ చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాహిత్య బాలాజీ, వర్మ, లెండి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మధుసూదన్, స్నిపర్స్ మహిళా సంఘం నిర్వాహకురాలు కటారి శ్రీలత, జానకి రామారావు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



రోగులకు మందులు అందిస్తున్న రాజబాబు

తగరపువలస, ఫిబ్రవరి 7 : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. బుధవారం చిట్టివలస బంతాట మైదానంలో ఎన్‌టీఆర్ సేవా ట్రస్టు, గీతం ఆస్పత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు 500 మందికి పరీక్షలు చేసి, మందులు అందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్ట సురేష్, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జనసేన నాయకురాలు భువనేశ్వరి పాల్గొన్నారు.

కేజీబీవీలో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

పద్మనాభం, ఫిబ్రవరి 7 : పద్మనాభం కేజీబీవీలో బుధవారం సాయంత్రం పదో తరగతి, ఇం టర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ కె. రాంబాబు మాట్లాడుతూ మనిషి జీవితాన్ని ఉన్నత స్థానానికి తీసుకువెళ్లేది విద్య ఒక్కటేనన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ప్లాంకులు, స్కేళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్‌లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

నమ్మివానిపేటలో బోరు ఏర్పాటు

తగరపువలస, ఫిబ్రవరి 7 : జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేటలో ఎట్టకేలకు తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో కుళాయిలు, బోర్లు లేకపోవడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈమేరకు వైసీపీ వార్డు ఇన్‌చార్జి కరుణాకర్‌రెడ్డి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ల డంతో ఆయన బోరు మంజూరు చేశారు.